ఫ్లాష్‌బ్యాక్ ..మరి ఇవేంటి బాసూ?


కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ రౌడీయిజాన్ని గుర్తు చేసుకుంటున్న జనం


"తిరుపతిలో ఇంత అరాచకం ఎన్నడైనా చూశామా? రౌడీయిజంతో, దౌర్జన్యంతో.. ఇదీ ఒక గెలుపేనా? ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది" అంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఆవేశంతో ఊగిపోతున్నారు. ఆగ్రహంతో రగిలిపోతున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. నాలుగున్నరేళ్ల తర్వాత బదులు తీర్చుకుంటామని బెదిరిస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో తిరుపతిలోని వైసీపీ నాయకుల తీరు ఇప్పుడొక చర్చగా మారింది. అధికారంలో ఉన్న ఐదేళ్లూ.. వీరు చేసిందేమిటి.. అని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. దొంగ ఓట్ల దండుతో, దౌర్జన్యాలతో, దాడులతో, బెదిరింపులతో గతంలో జరిగిన ఎన్నికలను ప్రస్తావిస్తున్నారు. ఏకంగా ఎన్నికల అధికారి కంప్యూటర్‌లోకే చొరబడి నకిలీ ఓటరు కార్డులు తయారు చేశారంటూ కేంద్ర ఎన్నికల సంఘమే తప్పు పట్టిన వైనాన్ని జనం మరచిపోలేదు. తిరుపతి ప్రశాంత చరిత్రకే మాయని మచ్చను మిగిల్చిన ఘనులు.. ఇప్పుడిలా నీతి వాక్యాలు వల్లిస్తున్నారేమిటా అని ఆశ్చర్యపోతున్నారు. రౌడీయిజమే రాజకీయమనేలా ప్రవర్తించిన వారే ఏడుపులు పెడబొబ్బలు పెట్టడం విచిత్రమని ప్రజలు వ్యాఖ్యానిస్తూ.. ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లి జగనన్న పాలనలో జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల తంతును ఇలా గుర్తు చేసుకుంటున్నారు...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

13 మార్చి 2020 తిరుపతి మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌కు ఆఖరి తేది..

నామినేషన్లు వేసేందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థులను అడ్డుకోవడం, బెదిరించడం, నామినేషన్లను చించివేయడం, చొక్కాలు పట్టుకుని లాగి పడేయడం, బూతులు తిట్టడం.. వెనక్కి పంపడం... వంటివి పోలీసుల సాక్షిగానే అడ్డూ అదుపూ లేకుండా జరిగాయి. అంతకు ముందు ఇవే చర్యలతో తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లకు గాను 22 ఏకగ్రీవాలు చేసుకున్నారు. 27 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఫోర్జరీ సంతకం వివాదం కారణంగా ఎస్ఈసీ ఆదేశం మేరకు 7వ డివిజన్లో ఎన్నిక ఆగిపోయింది. అప్పుడు జరిగిన పరిణామాలు ఇవీ...





ఏకంగా ఫోర్జరీకే తెగించారు

టీడీపీకి చెందిన పెరుమాళ్ మధు భార్య విజయలక్ష్మి 7వ వార్డునుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్ని చేసినా ఆమె వెనక్కి తగ్గలేదు. దీంతో ఆమె ఉపసంహరించుకున్నారని అధికారి ప్రకటించారు. తన సంతకాన్ని మురళి అనే వ్యక్తి ఫోర్జరీ చేసి నామినేషన్‌ను విత్‌డ్రా చేశారంటూ అభ్యర్థి ఎన్నికల అధికారులను నిలదీశారు. తమకు న్యాయం జరగకపోతే కార్పొరేషన్ కార్యాలయం ముందే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. దీంతో 7వ వార్డు ఎన్నిక ఆగిపోయింది. విచారణ అనంతరం అది ఫోర్జరీ సంతకమని కూడా ఫోరెన్సిక్ తేల్చింది.



తనకు జరిగిన అన్యాయానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అభ్యర్థి విజయలక్ష్మి

స్వతంత్రులనూ వదల్లేదు

41వ డివిజన్‌కు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వచ్చిన టీటీడీ ఉద్యోగుల సంఘం నేత వెంకటేష్ భార్య చంద్రికను వైసీపీ నేతలు అడ్డుకున్నారు. నామినేషన్ పత్రాలను చింపి బయటకు పంపారు. దీంతో చంద్రికకు మద్దతుగా సీఐటీయూ నాయకుడు కందారపు మురళి సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అదేవిధంగా 38వ డివిజన్‌కు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వచ్చిన దళిత అభ్యర్థి విల్సన్ నామినేషన్ పత్రాలను వైసీపీ నాయకులు చించి తరిమేశారు. దీంతో దిక్కుతోచని విల్సన్ అంబేడ్కర్ భవనం వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు.



టీ దుకాణాన్ని తొలగించారు

టీడీపీ నేత ఆర్సీ శ్రీనివాస్ భార్య ఆర్సీ లక్ష్మీదేవి 43వ డివిజన్ అభ్యర్థిగా రంగంలోకి దిగడంతో ఆమె టీ దుకాణాన్ని వైసీపీ నేతలు కార్పొరేషన్ అధికారులను అడ్డుపెట్టుకుని తొలిగించారు. వారి జీవనాధా రాన్ని కోల్పోయేలా చేశారు.

ప్రపోజర్స్‌ను వదలని వైనం

45వ డివిజన్‌లో నామినేషన్ వేసేందుకు టీడీపీ అభ్యర్థి చంద్రమోహన్‌కు ప్రపోజర్‌గా ఉన్న గోళ్ల లోకేష్ నాయుడుపై వైసీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. తిరుమల బైపాస్‌రోడ్డులోని అతని టీ స్టాల్‌ను ధ్వంసం చేశారు.



సుగుణమ్మపై బూతుల దండకం

తిరుపతి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ముగింపు రోజున మాజీ ఎమ్మెల్యే సుగుణ మ్మ కార్పొరేషన్ కార్యాలయం లోపలికి వస్తుండగా పూటుగా మద్యం సేవించిన ఓ వైసీపీ మద్దతుదారుడు అటకాయించాడు. దుర్భాషలాడారు. అభ్యర్థి మన్నెం శ్రీనివాసులను నోటికొచ్చినట్టు తిట్టి మెడపట్టి బయటకు తోసేశాడు. పాపం.. పోలీసులు మాత్రం సినిమా చూస్తున్నట్టు ఉండిపోయారు.

గడువు దాటేలా పన్నాగం

పోస్టల్ కాలనీలోని సచివాలయ కేంద్రంలో వైసీపీ నాయకులు ముందస్తుగా ఓ 50మంది డమ్మీ అభ్యర్థులను క్యూలో నిలబెట్టారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన ఆర్కే విమలను సమయం అయ్యేవరకు నిలబెట్టారు. సమయం దాటిపోవడంతో బాధతో నామినేషన్ పత్రాలు చించేసి అభ్యర్థి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

20 నిమిషాలకు ముందే..

మరో 20 నిమిషాల్లో నామినేషన్ల ఘట్టం పూర్తవుతుండగా వైసీపీ మద్దతుదారు ఒకరు నగరపాలక కార్యాలయం గేటు మూసివేశాడు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వారిని లోనికి అనుమతించలేదు. దీంతో నామినేషన్ వేసేందుకు వచ్చినవారు వెనుతిరగాల్సి వచ్చింది.

అభినయ్ ఏకగ్రీవం కోసం..

వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి తనయుడు భూమన అభినయ్ 4వ డివిజన్ నుంచి నామినేషన్ వేశారు. టీడీపీ తరఫున వేణు, అరుణలను పోటీలో నిలపాలని ఆ పార్టీ భావించింది. తమతో ఎవరినీ కలవనీయకుండా ఫోన్లు తీసిపెట్టుకుని పక్కాగా స్కెచ్ వేసుకున్నారని టీడీపీ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది.

బయటకు తోసేశారు

16వ వార్డుకు నామినేషన్ వేసేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి ఆనంద్‌బాబు యాదవ్‌ను వైసీపీ అభ్యర్థి మోహన్ కృష్ణ యాదవ్, అతని సహచరుడు నవీన్ నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. షర్ట్ కాలర్ పట్టుకుని గేటు బయటకు నెట్టివేశారు. పోలీసులు చూస్తూ ఉండిపోయారు.

బీజేపీ అభ్యర్థిని కిందపడేసి కొట్టి..

బీజేపీ అభ్యర్థిగా సీఎస్ శరవణ 10వ డివిజన్‌కు నామినేషన్ వేసేందుకు వెళుతుండగా వైసీపీ కార్యకర్తలు అతడిని కిందపడదోసి నామినేషన్ పత్రాలతో పాటు మొబైల్ ఫోన్, ఏటీఎం లాక్కున్నారు. అప్పటికే అక్కడ ఉన్న ఎస్పీకి శరవణ మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోవడంతో ఆయన నిస్పృహతో వెనుతిరిగారు.

తిరుపతిని భ్రష్టుపట్టించింది మీరే

● తండ్రీ కొడుకులకు కార్పొరేటర్ దొడ్డారెడ్డి బహిరంగ లేఖ

తిరుపతి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన నాటకీయ పరిణామాల నేపథ్యంలో నలుగురు కార్పొరేటర్లపై వైసీపీ బహిష్కరణ వేటువేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా దొడ్డారెడ్డి కుటుంబంపైనే భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు ఫోకస్ చేయడం చర్చకు దారి తీసింది. దీనికి ప్రతిస్పందనగా వైసీపీ హయాంలో భూమనకు ఆత్మగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తనయుడు 10వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డా రెడ్డి ప్రతాప్‌రెడ్డి గురువారం సోషల్ మీడియాలో విడుదల చేసిన ఓ లేఖ రాజకీయంగా చర్చగా మారింది. 'దివంగత వైఎస్ రాజారెడ్డితో మొదలైన మా రాజకీయ ప్రస్థానం వైఎస్ఆర్‌తో కలిసి నడిచేలా చేసింది. జగనన్న కష్ట కాలంలోనూ పార్టీ వీడకుండా ఎన్ని అవమానాలు ఎదురైనా అంకితభావంతో పనిచేశాం. దానికి బహుమానంగా మాపై సస్పెన్షన్ వేస్తారా? మీ మొండి వైఖరితో పార్టీకోసం కష్టపడినవారిని విస్మరించినందుకే రాయలసీమలో ఏ అభ్యర్థి పొందని ఘోరమైన ఓటమిని తిరుపతిలో మూటకట్టుకున్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి కష్టపడ్డ ఒక్క కార్యకర్తకైనా అధికారంలోకి వచ్చాక లబ్ధి చేకూర్చారా? వైఎస్ కుటుంబ కోసం పనిచేశామే గానీ మీలాంటి చరిత్ర హీనులకోసం కాదు. తిరుపతిలో పార్టీలకతీతంగా సోదర భావంతో మెలిగే వాతావరణాన్ని మీరే తుడిచివేశారు. మీ నీచమైన రాజకీయాలకోసం, విద్వేష భేషజాలకు ఆజ్యంపోసి ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని భ్రష్టుపట్టించింది మీ తండ్రీ కొడుకులే కదా!' అంటూ పోస్ట్ చేసిన లేఖ వైరల్‌గా మారింది.

30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్

● నేటినుంచి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తెలుగు భాషను స్పష్టంగా చదివేలా నేర్పించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమిది. తిరుపతికి చెందిన భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తిరుపతి నగరం సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్‌ఎం పాఠశాలలో శుక్రవారం నుంచి 30 రోజులపాటు పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నారు. ఈ మేరకు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలల్లోని 2, 3 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి 30 రోజుల్లోనే 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదివేలా చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అన్ని పాఠశాలల్లోనూ ప్రారంభించనున్నారు.



ఆయన (రజనీకాంత్) చిట్టి. ఈయనేమో (జగన్) చిట్టిరెడ్డి. ఇప్పుడు జగన్ 2.0గా వస్తారంట. కసిగా, స్పీడ్‌గా వస్తారంట. ఆయన 5.0గా వచ్చినా జనం ఓట్లు వేయరు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నంచేసి, 20 ఏళ్ల వెనక్కి నెట్టేశారు. ఇప్పుడు విదేశాలకు వెళ్లొచ్చి మరో 30 ఏళ్ల రాష్ట్రాన్ని ఏలతానంటూ మతిభ్రమించి మాట్లాడుతున్నారు.

- కిరణ్‌రాయల్,
తిరుపతి జనసేన నేత

సీబీసీఐ కింద భూములు కోల్పోతున్న రైతులకు రూ. 78.84 కోట్ల పరిహారం

● రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం గ్రామాల పరిధిలో చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీసీఐ)కు భూములు కోల్పోతున్న రైతులకు రూ.78,84,83,200 పరిహారం చెల్లించడానికి కలెక్టర్ పంపిన ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. ఈ అంశాన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ 2012 సెప్టెంబరు 14న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు 571ను సడలించి మరీ ఈ ఒక్కసారికి ఈ మొత్తాన్ని పరిహారంగా చెల్లించేందుకు అంగీకరించింది. టీటీడీలో 15 సీనియర్ పోటు వర్కర్ పోస్టులను సూపర్‌వైజర్ పోస్టులుగా స్థాయి పెంచాలని టీటీడీ చేసిన అభ్యర్థనపై మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు 15 సీనియర్ పోటు వర్కర్ పోస్టులను రూ. 40,970 - రూ.1,24,380 జీత శ్రేణితో సీనియర్ అసిస్టెంట్ హోదాతో సమాన హోదా కల్పిస్తూ సూపర్‌వైజర్ పోస్టులుగా స్థాయి పెంచేందుకు అంగీకరించింది. అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జిల్లాకు సంబంధించి ఈ రెండు సానుకూల నిర్ణయాలు తీసుకున్నారు.

ఏమార్చి.. ఇంట్లో నగలు కొట్టేసి..!

● ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

● రూ.30 లక్షల బంగారు ఆభరణాలు, కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంటి డ్రైనేజీ పైపులు కొలతలు తీయాలంటూ యజమానిని పక్కకు తీసుకెళతారు. మరొకరు ఇంట్లోకి దూరి నగలు.. విలువైన ఆస్తులు మూటకట్టేస్తారు. ఇలా తిరుపతిలో దొంగతనానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.30 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను గురువారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ కేశవాయనగుంటకు చెందిన పోలిన ధనమ్మ ఇంటి వద్దకు గతేడాది డిసెంబరు 20వ తేదీన కృష్ణ, అతడి తమ్ముడు శరత్, వేణుగోపాల్ వచ్చారు. మున్సిపల్ సిబ్బంది అని చెప్పారు. ఆ ఇంట్లో వాటర్ కనెక్షన్లు, డ్రైనేజీ పైపుల కొలతలు తీయాలని ఆమెను నమ్మించారు. ఇంటి పక్కన, వెనుక వున్న డ్రైనేజీ పైపులను చూపిస్తున్న ఆమె వెంట ఇద్దరు వెళ్లారు. మరొకడు ఇంట్లోకి వెళ్లి బీరువా, అల్మారాలో ఉన్న బంగారు నగలు, డబ్బు అపహరించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్ పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి.. పాత వేలిముద్రలు, వారి కళ్ల ఫొటోల ఆధారంగా నిందితుల కోసం అనుమానిత ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు తిరుపతిలోని చెర్లోపల్లె రోడ్డులో తనిఖీలు చేస్తుండగా నిందితులు తారస పడ్డారు. క్రైం పోలీసుల వద్దనున్న సమాచారం ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి రూ 30 లక్షల విలువైన 280 గ్రాముల బంగారు నగలు, ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో విశేష ప్రతిభ కనపరచిన క్రైం సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్ కుమార్, ఎస్ఐ ప్రదీప్ కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రవిప్రకాష్, మురళి, మునిరాజులు, బసవరాజు రమేష్, గోపీకృష్ణ, వినాయక, కానిస్టేబుళ్ళు నాగరాజు శెట్టి, మోహన్, హరిప్రసాద్, సైబర్ క్రైం సిబ్బంది రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఎస్పీ

నిందితులది కర్ణాటక : నిందితులైన ఎ.కృష్ణ, అతడి తమ్ముడు శరత్, వేణుగోపాల్‌ది కర్నాటక రాష్ట్రం షిమోగా. ఈ ముగ్గురు స్నేహంగా ఉండేవారు. రవి, గణేష్, ప్రశాంత్‌తో కలిసి చెడు అలవాట్లకు లోనయ్యారు. చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఆ తర్వాత బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు కొట్టేసేవారు. ఆ తర్వాత ఇళ్లలో దొంగతనాలు, మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. పలుసార్లు జైలుకు వెళ్లొచ్చారు.



స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రూ.4.20 కోట్ల ఎర్రచందనం పట్టివేత

● ఎనిమిది మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్

మంగళం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో రూ.4.20 కోట్ల విలువైన ఆరు టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎనిమిది మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశామన్నారు. ఆయన చెప్పిన ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం సానిపాయలోని కోమిటోనిచెరువు సమీపంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూంబింగ్ చేపట్టారు. ఒక కారు, మోటార్ సైకిల్ ఆగి ఉండటం.. కొందరు ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేసేందుకు వెళ్తుండటాన్ని గమనించారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది వారిని చుట్టుముట్టగా ఎనిమిది మంది పట్టుబడ్డారు. మిగిలిన వారు పారిపోయారు. వారి నుంచి రెండు వాహనాలు, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. విచారణలో వారు చెప్పిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం హొస్కోట తాలూకా కటికనల్లి సమీపంలో దాచి ఉంచిన 185 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం, స్మగ్లర్లను, వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటి మొత్తం విలువ రూ.4.2 కోట్లుగా అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సిబ్బందికి రివార్డు ప్రకటించారు.



తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్ సిబ్బంది

వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. స్వాతి బిలాల్ మాలిక్ పేరిట గురువారం వచ్చిన ఈ మెయిల్‌లో చిత్రకళ గోపాల్ ఘటన, సికిందర్ దర్గా ఘటన, సూసైడ్ హ్యూమన్ ఐఈడీల తయారీ తదితర అంశాలను ప్రస్తావించారు. ప్రిన్సిపాల్ రమణ డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో తిరుపతి రూరల్ పోలీసులు, డాగ్.. బాంబు డిస్పోజ్ స్క్వాడ్లు కళాశాలకు చేరుకున్నాయి. ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, హాస్టళ్లు, పరిసరాల్లోనూ రెండు గంటలకుపైగా తనిఖీ చేశారు. ఏవీ కనిపించకపోవడంతో మెయిల్ ఉత్తుత్తిదేనని తేల్చారు. గతంలోనూ ఇదే తరహాలో బెదిరింపు మెయిల్ వచ్చింది. కాగా, ఇప్పుడు వచ్చిన మెయిల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి.. సంబంధిత వ్యక్తులను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేశామని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి 21వ ర్యాంకు



తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పనితీరుపరంగా 21వ ర్యాంకు వచ్చింది. గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ ర్యాంకులను ప్రకటించారు. గతేడాది జూలై నుంచి డిసెంబరు దాకా ఆరు నెలల పాటు ఫైళ్ల పరిష్కారంలో మంత్రుల పనితీరు ఆధారంగా ర్యాంకులు నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. మొత్తం 24 మంది మంత్రులు ఉండగా.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి సత్యప్రసాద్‌కు 21వ ర్యాంకు వచ్చింది.

చంద్రగిరిలో భూ కబ్జాయత్నానికి రెవెన్యూ బ్రేక్


ప్రభుత్వ భూమిలో కబ్జా చేయడానికి తవ్విన ట్రెంచ్

చంద్రగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో విలువైన ప్రభుత్వ భూమిని ఓనాయకుడు కబ్జా చేయడానికి ప్రయత్నించాడు. గురువారం చంద్రగిరి లెక్కదాఖల్లోని సర్వే నెంబర్ 32లో లక్షలాది రూపాయల విలువైన నాలుగు సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడు. జేసీబీతో ముళ్ళ కంపలు తొలగించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సబంధిత స్థలానికి చేరుకున్నారు. కబ్జాయత్నాన్ని అడ్డుకున్నారు. ఆభూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

విశ్రాంత స్టేషన్ మేనేజర్ విద్యాసామగ్రి వితరణ



పాకాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రప్రదేశ్): స్థానిక ఎస్వీఎస్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విశ్రాంత రైల్వే స్టేషన్ మేనేజర్ భాస్కర్ బాబు ఆయన సతీమణి రమణి విదార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. 310 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. తమ కుమారుడు సాయివిఘ్నేష్ వర్ధంతి సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు మోహన్, ఎస్ఎంసీ ఛైర్మెన్ కుసుమ కుమారి, వైస్ ఛైర్మెన్ మహాలక్ష్మీ, బాబు, మునిరత్నం మచ్చా దొరస్వామినాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పాకాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గాదంకిలోని జాతీయ వాయుమండలీయ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్)లో స్వచ్ఛత పక్షోత్సవాలలో గురువారం ఉద్యోగులు, విద్యార్థులకు వ్యాసరచన, వాల్‌పెయింటింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే అనర్థాల గురించి పరిసర గ్రామాల ప్రజలకు వివరించారు. మొక్కలు నాటి పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్ర, కమిటి సభ్యులు పి.రవిప్రసాద్, ఎం.శ్రీనివాస గుప్త, బి.మల్లిక మాధురి, జి.హరివెంకటకుమార్, పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల గోదాము తనిఖీ



చంద్రగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నిత్యావసర సరుకుల గోదామును ఆర్డీవో రామ్మోహన్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. గోదాములోనే సరుకులు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శివరామసుబ్బయ్య, గోదాము ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నాబార్డుతో గ్రామీణాభివృద్ధి : ఎమ్మెల్యే నాని


వాణిజ్య సముదాయపు గదుల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): .మండల కేంద్రంలో నాబార్డు నిధులతో ఆధునీకరించిన వారపు సంత వాణిజ్య సముదాయ గదులు, మార్కెట్ షెడ్‌లను శాసన సభ్యుడు పులివర్తి నాని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నాబార్డు నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు. వారపు సంతలు రైతుల ఆర్థిక పురోగతి పట్టుగొమ్మలన్నారు. కార్యక్రమంలో నాబార్డు జీఎంలు ఎంఆర్ గోపాల్, సతీష్,కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

చంద్రగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దానామూర్తిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త పులివర్తి దేవరాజులనాయుడు మృతికి ఎమ్మెల్యే పులివర్తి నాని సంతాపం ప్రకటించారు. కార్యకర్త అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి దేవరాజులనాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా రాజశ్యామలదేవి హోమం



రామచంద్రాపురరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాజశ్యామల హోమం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రక్తి పీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారు, రాజశ్యామలదేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ మేళతాళాల నడుమ జరిగింది. కార్యక్రమాల్లో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, పీఠాధిశ్వరి రమ్యానందభారతి స్వామి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

తిరుమల ఘాట్‌లో అదుపు తప్పిన కారు

● నలుగురికి స్వల్ప గాయాలు



తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులో గురువారం ఓ కారు అదపుతప్పి కొండను ఢీకొంది. ఈప్రమాదంలో బెంగుళూరుకు చెందిన కుటుంబంలోని నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. గురువారం సాయంత్రం వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అలిపిరికి సమీపంలోని వినాయక స్వామి ఆలయం వద్ద అదుపు తప్పి కుడివైపునున్న గట్టును ఢీకొంది.

ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతుల ప్రారంభం

పాకాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాంగోనగర్‌లో దామలచెరువు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో గురువారం ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను డిస్ట్రిక్ట్ ఛైర్ పర్సన్ జి.రామయ్య ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.నాగూర్‌బాషా ఆధ్వర్యంలో టైలరింగ్ మూడవ బ్యాచ్ ప్రారంభమయింది. మహిళలు టైలరింగ్‌లో మెళకువలు నేర్చుకొని ఉపాది పొంది ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సైదుల్లా, ఇన్‌స్ట్రక్టర్ మునీర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

గృహహింస కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

వడమాలపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజోతి): గృహహింస, అదనపు కట్న వేధింపుల కేసులో ముగ్గురికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. పత్తి పుత్తూరు పంచాయతీ అమ్మగుంట గ్రామానికి చెందిన శ్రీవాణి 2016లో తన భర్త మదనమోహన్ రెడ్డి, అత్త నాగమ్మ, ఆడబిడ్డ రాజ్యలక్ష్మి, మామ సుబ్బారెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, గృహ హింసకు పాల్పడుతున్నారని వడమాలపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు కాగా పుత్తూరు కోర్టులో విచారణ సాగింది. 2019లో మదనమోహన్ రెడ్డి మృతి చెందగా మిగిలిన ముద్దాయిలైన నాగమ్మ, రాజ్యలక్ష్మి, సుబ్బారెడ్డిలకు పుత్తూరు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ మూడు సంవత్సరాల జైలుశిక్ష, ఇద్దరు మహిళలకు రూ.8000 చొప్పన, సుబ్బారెడ్డికి రూ.9000 అపరాధ రుసుం విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ నిర్మల కేసు వాదించారు.

ప్రధాన కాలువ ఆక్రమణతో సాగుకు కటకట


పీవీపురం వద్ద నక్కల వంకలో కలుస్తున్న రాయలచెరువు నీరు - గంగిరెడ్డిపల్లెవద్ద మూడు కాలువలకుచేరని నీరు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాయచెరువు ప్రధాన కాలువ ఆక్రమణకు గురికావడంతో చెరువునీరు వృథాగా స్వర్ణముఖి పాలవుతోంది. పదేళ్లుగా చెరువు నిర్వహణ బాధతలను గాలికి వదిలేయడంతో పొలాలకు నీరు అందడంలేదు. 40 ఏళ్ల క్రితం వరకు ఈచెరువు నీటిని గంగిరెడ్డిపల్లి మూడు కాలువల వద్ద వంతుల లెక్కన పొలాలకు పారించుకునేవారు. కాలువ పూడిక ఏర్పడటంతో చెరువు నీటి వేగం తగ్గిపోయింది. కొన్నేళ్ల క్రితం చెరువు నుంచి సంజీవరాయపురం వరకు కిలోమీటరు దూరం ప్రధాన కాలువకు ఇరువైపులా రాతికట్టడం కట్టారు. దానికి పగుళ్ల ఏర్పడటంతో నీరు పొలాలపై వెళుతోంది. పదిమంది కూడా ఈ ఏడాది సాగుచేయలేని పరిస్థితి. రాయలచెరువు నీరు పీవీపురం వరకు వచ్చినా అక్కడ కాలువలు ఆక్రమణకు గురవ్వడంతో నక్కల గుండు వంక ద్వారా స్వర్ణముఖి పాలవుతోంది. పీవీపురం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని గంగిరెడ్డిపల్లి వద్ద మూడు కాలువలు ఉండేవి. ప్రస్తుతం ఒక కాలువ మిగిలింది ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి ప్రధాన కాలువ పూడిక తీస్తే స్వర్ణముఖిలో కలిసే నీటిని వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది.

తిరుమల ఘాట్‌లో ఓవర్ టేకింగ్ వద్దు : సీఐ


ఆర్టీసీ డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ హరిప్రసాద్

తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో భక్తులకు ఇబ్బంది కలిగేలా వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దని ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు తిరుమల ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లు, మెకానిక్‌లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించేలా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అతివేగంగా బస్సులను నడపకూడదన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా ఎక్కడపడితే అక్కడ బస్సులను ఆపకూడదన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు.

విద్యతో ఉన్నతశిఖరాలు

● ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మురళి,ఎమ్మెల్సీ శ్రీకాంత్



వేదికపై ఎమ్మెల్యే మురళిమోహన్, ఎమ్మెల్సీ శ్రీకాంత్, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, స్కూల్ ఛైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, డీవైఈఓ బాలాజి, తదితరులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): చిగురువాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీపబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం స్థానిక మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళిమోహన్, ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ..చదువు ద్వారా జీవితంలో ఉన్నతస్థాయి చేరుకోగలమన్నారు. పాఠశాల దశ నుంచి క్రమశిక్షణతోపాటు విలువలను పెంచుకోవాలని సూచించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అడిషనల్ ఎస్పీరవిమనోహరాచారి, స్కూల్ ఛైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, డీవైఈవో బాలాజి, టీడీపీ అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, కేఎస్ వాసు, ఛైర్ పర్సన్ పాలడుగు విజయ పాల్గొన్నారు.

నేడు రైల్వే పోస్టల్ ఆల్ ఇండియా సర్కిల్ సమావేశం

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు రైల్వే పోస్టల్ ఆల్ ఇండియా సర్కిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కర్నూలు రీజియన్ సూపరింటెండెంట్ అమర్నాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్లకోసారి జరిగే సర్కిల్ సమావేశం ఈసారి ఇక్కడ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మన్నసముద్రం సమీపంలోని కొండరాయుడు చెరువులో గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని ఏర్పేడు పోలీసులు గురువారం గుర్తించారు. ఇతడు 20 రోజుల క్రితం చేపలు పట్టడానికి వచ్చి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈవ్యక్తి నల్లప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏర్పేడు పోలీసులను సంప్రదించాలని సీఐ జయచంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మినీ వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బీఎన్‌కండ్రిగ మండలంలో చోటు చేసుకుంది. బీఎన్‌కండ్రిగ ఎస్ఐ విశ్వనాథ నాయుడు కథనం మేరకు తొట్టంబేడు మండలం బసవన్నకుంట గ్రామానికి చెందిన హరికృష్ణ(24) సొంత పనుల నిమిత్తం గురువారం బీఎన్‌కండ్రిగకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి శ్రీకాళహస్తి వైపు బయలుదేరాడు. బీఎన్‌కండ్రిగవైపు వస్తున్న ఓ మినీ వ్యాన్ మండలంలోని చల్లమాంబపురం చెరువు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. బీఎన్‌కండ్రిగ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల్లో చోరీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నీరువాయికి చెందిన మూడు ఆలయాల్లో బుధవారం రాత్రి దొంగలు నగదు, నగలు దోచుకెళ్లారు. వివరాలు ఇలా... గ్రామంలోని ఈశ్వరాలయంలో హుండీ పగులగొట్టి సుమారు రూ.10వేలకు పైగా నగదు దొంగతనం జరిగింది. అంకాళపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి మంగళసూత్రంతో పాటు హుండీని పగులగొట్టి రూ.2వేల నగదు దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన బీసీ కాలనీ ఓంశక్తి గుడిలో మంగళ సూత్రంతో పాటు హుండీని పగులగొట్టి రూ.10వేలు నగదు దొంగిలించుకెళ్లారు. గత వారం రోజుల క్రితమే పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో నాగాలమ్మ దేవాలయం, రెప్పలపట్టు కొత్త నాంచారమ్మ దేవాలయాల హుండీలను పగులగొట్టి డబ్బు పట్టుకెళ్లారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికంగా ఉన్న జనం భయంతో హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పటిష్ఠ నిఘా ఉంచి, రాత్రి పూట గస్తీని ముమ్మరం చేసి దొంగల ఆట కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీరు-చెట్టు బిల్లులకు మోక్షం

● రూ.160 కోట్ల మంజూరుకు మంత్రివర్గ ఆమోదం

చిత్తూరు సిటీ/చిత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న నీరు - చెట్టు బిల్లుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.వీటిలో నీరు - చెట్టు బిల్లుల మంజూరు, ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న 386 మంది ఇంజనీర్లపై చర్యల ఉపసంహరణ తదితరాలున్నాయి. ఇందులో మన జిల్లాకు సంబంధించి గత ఐదేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న నీరు - చెట్టు బిల్లులు సుమారు రూ.160 కోట్లు మంజూరు కానున్నాయి.2015-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి కోసం నీరు-చెట్టు పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది. చెక్ డ్యాముల మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం, చెరువుల అభివృద్ధి, జంగిల్ క్లియరెన్సు, కాలువల పునరుద్ధరణ వంటి జల సంరక్షణ పనులు ఈ కార్యక్రమం కింద జరిగాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా రూ.650.28 కోట్ల విలువైన 5,978 పనులు మంజూరయ్యాయి. వీటిలో రూ.366.26కోట్ల అంచనాతో 3,697 పనులు దశలవారీగా పూర్తయ్యాయి. వీటిలో 3068 చెక్‌డ్యాం పనులు, 304 సరఫరా కాలువల పనులు, 180 జంగిల్ క్లియరెన్సు పనులు, 2,430 చెరువుల అభివృద్ధి పనులను చేశారు.వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక అంతవరకు అమలైన అన్ని పథకాలనూ రద్దు చేసిన విషయం తెలిసిందే. నీరు-చెట్టుకు సంబంధించి కూడా రూ.120 కోట్ల విలువ చేసే 713 పనులను రద్దు చేసింది. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను కూడా విజిలెన్సు విచారణ పేరుతో ఆపేశారు.దీనిపై కోర్టుకు వెళ్లిన కొంతమంది కాంట్రా క్టర్లకు మాత్రం రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లించారు. మిగిలిన వారంతా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో అల్లాడి పోయారు.ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లుల్ని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడం మొదలెట్టింది. రూ.20 కోట్లను విడుదల చేసింది కూడా.ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీరు- చెట్టు కార్యక్రమానికి సంబంధించిన మిగిలిన బిల్లుల్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయండంటూ ఆదేశాలు జారీ చేయడంతో కాంట్రాక్టర్ల ఆశలు చిగురించాయి.మంత్రి ఆదేశాల తో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పెండింగులో ఉన్న బిల్లుల్ని చిత్తూరులోని జలవనరుల శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో అప్‌లోడ్ చేసే ప్రక్రియ ఊపందుకుంది. తాజాగా మంత్రివర్గ నిర్ణయంపై బిల్లులు రాక తీవ్రంగా నష్టపోయిన కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇరిగేషన్ శాఖలో వివిధ పనులకు సంబంధించి సుమారు 30 మంది ఇంజనీర్లపై తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.


మాలధారులకు తయారుచేసిన వస్త్రాలు

దేవుడి అలంకరణ వస్త్రాలు



కొత్తపేటలో వస్త్రాల తయారీ

నగరి వస్త్రాలకు ఆధ్యాత్మిక సౌరభాలు!


విగ్రహాలకు చుట్టే వస్త్రాలు

కాటన్ చొక్కాల నుంచి ఉత్సవాల వస్త్రాల దాకా నేతన్న ప్రస్థానం

నగరి, ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు అంటే 50యేళ్ల క్రితం నూలు వస్త్రాల తయారీకి నగరి ప్రసిద్ధి. నగరి కాటన్ చొక్కాలు,ప్యాంట్లు,చీరలకు మన దేశంలోనే కాదు విదేశాల్లోనూ ఎంతో డిమాండు వుండేది.దేశంలో గుజరాత్ తర్వాత మరమగ్గాలు వాడిన ప్రాంతంగా 1976లోనే నగరి నేతపరిశ్రమ పేరుగాంచింది. కొత్తపేట,ఏకాంబరకుప్పం ప్రాంతాల్లో తయారయ్యే కాటన్ చొక్కాలు, కాటన్ చీరలకు విదేశాల్లో కూడా డిమాండు వుండేది.అమెరికా,జపాన్ దేశాలతో పాటు యూరప్ దేశాల నుంచి కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు నగరికి వచ్చి నూలు వస్త్రాలకు ఆర్డర్లు ఇచ్చేవారు. నగరి, పుత్తూరు, నారాయణవనంలో వున్న ఉత్పత్తిదారులు విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు.మాంగాడు పట్టుచీరలకు, నూలు చీరలకు ప్రసిద్ధి గాంచింది. షర్టు బిట్ల తయారీలో పేరు గాంచిన నగరి నేతగాళ్లు 1990 తర్వాత నూలు రేట్లు పెరగడం, ఎగుమతులపై ఆంక్షల కారణంగా విదేశీ ఆర్డర్లు తగ్గిపోవడంతో చుడీదార్ల తయారీపై మొగ్గు చూపారు.ప్రస్తుతం చుడీదార్లతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన వస్త్రాల తయారీలో ముందడుగు వేస్తున్నారు.

వస్త్రాల తయారీలో పవిత్రతకు ప్రాధాన్యం

వివిధ ఆలయాల్లో కుంభాభిషేక కార్యక్రమాలకు ఉపయోగించే దుస్తులన్నీ ప్రస్తుతం నగరిలోని చింతలపట్టెడ,కొత్తపేట, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట,సత్రవాడ ప్రాంతాల్లో మొదలియార్ల చేతులమీదుగా తయారవుతున్నాయి. ప్రధాన ఆచార్య వస్త్రాలు, సాదిక వస్త్రాలు, వాస్తు వస్త్రాలు, పరివట్టం, కుంభాభిషేకం చీరలు, రవికలు, వినాయక విగ్రహాలకు కట్టే పంచెలు, కలశాలపై ఉంచే దుస్తులను అవసరమైన వారు ఇక్కడ కొనుగోలు చేస్తున్నారు.అలాగే అయ్యప్ప దీక్షకు వాడే నలుపు, నీలం, కాషాయ రంగు వస్త్రాలు, గోవిందమాలకు వాడే పసుపు, సుబ్రమణ్య స్వామి దీక్షకు వాడే పచ్చరంగు వస్త్రాలు, ఓంశక్తి, ఆదిపరాశక్తి అమ్మవారికి వాడే ఎరుపు రంగు వస్త్రాలను కూడా ఇక్కడ తయారుచేస్తున్నారు.వస్త్రం కొలతను అనుసరించి రోజుకు 15 నుంచి 20 వస్త్రాలు ఒక మగ్గంలో తయారవుతాయి.ఈ వస్త్రాలు తయారుచేసే సమయంలో పవిత్రతకు ప్రాధాన్యం ఇస్తారు.స్నానం చేయకుండా పనిలోకి దిగరు. మద్యం, మాంసాహారం జోలికెళ్లరు.బంధువులెవరైనా మరణించి అంటు వున్న సమయంలో వస్త్రాలు నేయడం మానేస్తారు.


కుంభాభిషేకానికి వాడే వస్త్రాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు దుస్తుల సరఫరా

నగరి ప్రాంతంలో నేసే ఆధ్యాత్మికపరమైన కార్యక్రమాల్లో ఉపయోగించే వస్త్రాలకు మన రాష్ట్రంతో బాటు తమిళనాడులోనూ మంచి గిరాకీ వుంది.తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కుంభకోణం, తంజావూరు, మదురై, పళని, చిదంబరం, తిరువణ్ణామలై, కాంచీపురం, తిరుచ్చి, కన్నియాకుమారి, తిరుచందూర్, నాగర్‌కోవిల్ తదితర ఆలయాల్లో జరిగే వేడుకలకు ఇక్కడినుంచే వస్త్రాలు తీసుకెళతారు. వ్యాపార కేంద్రాలైన చెన్నై, ఈరోడ్డు ప్రాంతాలకు చెందినవారు ఇక్కడినుంచే ఆధ్యాత్మిక వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు.

పట్టించుకోండి సారూ..!

గరుడ వారధి పిల్లర్‌పై పిచ్చిరాతలు



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లీలామహల్ కూడలి నుంచి కపిలతీర్థం వెళ్లే మార్గంలోని గరుడవారధి 64వ పిల్లర్‌పై అభ్యంతరకరమైన పిచ్చిరాతలు రాసున్నాయి. ఆ మార్గంలో వెళ్లే వారు వీటిని చూసి పవిత్రమైన వారధిపై ఇలాంటి అసభ్యకరమైన రాతలా అని మాట్లాడుకోవడం కనిపిస్తోంది. తిరుమల వెళ్లే భక్తులు సైతం ఈ దృశ్యాలను చూసి ఆవేదన చెందుతున్నారు.

ఎస్సీ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య తెలిపారు. గురువారం ఓ హోటల్లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా పి.చెంగ్రాయులు, ప్రధాన కార్యదర్శిగా కె.భూపాల్, కోశాధికారిగా ఎం.ధనంజయ, మరో 16 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

డిప్యూటీ మేయర్‌కు అభినందన



తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన టీడీపీ నేత ఆర్సీ మునికృష్ణను గురువారం స్థానిక మహతి ఆడిటోరియం వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌లు అభినందించారు. శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, రవితేజ నాయుడు, మణి నాయుడు, చంద్రశేఖర రెడ్డి, దేవా, చంద్ర, వివేక్, ఆనంద్ గౌడ్, బాలాజీలు పాల్గొన్నారు. కాగా డిప్యూటీ మేయర్‌గా విజయం సాధించిన ఆర్సీ మునికృష్ణ ను జనసేన నేత కిరణ్‌రాయల్ సన్మానించారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్



శివరంజని

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని పి.శివరంజనికి పీహెచ్‌డీ(డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం తెలిపారు. బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి ఉమామహేశ్వరి పర్యవేక్షణలో ట్రాన్స్ క్రిప్టోమిక్ విధానం ద్వారా మానవ గర్భాశయ క్యాన్సరుకు వ్యతిరేకంగా సంభావ్య ఔషధ లక్ష్యాలను, నిరోధక రూపకల్పనను గుర్తించడం అనే అంశంపై పరిశోధనలు నిర్వహించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

అన్యమతస్తుల పేరుతో హిందూ ఉద్యోగులపై చర్యలు తగదు : బీజేపీ



తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో అన్యమ తస్తుల పేరుతో హిందూ ఉద్యోగులపైనా చర్యలకు ఉపక్రమిస్తున్నారని, ఇలాంటి వాటిని నివారించాలని ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఈవో శ్యామలరావును కోరారు. ఈ మేరకు గురువారం టీటీడీ పరిపాలనా భవనం లో ఆయన ఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీలో అన్యమతస్తులైన ఉద్యోగులను గుర్తించి, బదిలీ చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే అదే పేరుతో హిందూ ఉద్యోగులను కూడా తొలగిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, వారికి అన్యాయం జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని కోరారు.

రాజకీయ పరిజ్ఞానం లేకనే విమర్శలు

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తుంటే అర్థం చేసుకోలేని రాజకీయ పరిజ్ఞానం లేని నాయకులు విమర్శలు చేస్తున్నారని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. విద్యార్థులకు పెండింగ్ ఫీజులు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో గోపాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, మల్లం రవికుమార్, లోకేష్, ముని తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో 'సూర్యఘర్'పై అవగాహన



అధికారులతో సమీక్షిస్తున్న ఈఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి టౌన్ డివిజన్‌లో 8, 9 తేదీల్లో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం గురించి వినియోగదారులకు అవగాహన కల్పించనున్నట్లు తిరుపతి టౌన్ ఈఈ వి.చంద్రశేఖర రావు తెలిపారు. గురువా రం సాయంత్రం పాత తిరుచానూరు రోడ్డులోని డీఈ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో డీఈఈలు జయప్రకాష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు అన్యాయం చేయకండి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కంలో మీటర్ రీడింగ్ తీస్తున్న కార్మికులకు అన్యాయం చేయరాదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘం, ఏఐటీయూసీ నాయకులు వర్మ, రమేష్, చంద్రశేఖరరెడ్డి, ఎన్‌డీ రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. మీటర్ రీడర్స్ సమస్యలపై ఇటీవల సదరన్ డిస్కం ఉన్నత అధికారులకు విన్నవించామని తెలిపారు. డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారని, షిఫ్ట్ ఆపరేటర్లతోనూ రీడింగ్ తీయిస్తున్నారని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల పలువురు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. పీస్‌రేట్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

యువతిపై దాడి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన డబ్బులు అడిగినందుకు యువతిపై యువకుడు దాడి చేసిన ఘటన గురువారం తిరుపతిలోని బ్లిస్ సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. భాకరాపేటకు చెందిన శివారెడ్డి పోస్టల్ కాలనీలో కాపురముంటున్నాడు. ఇతనికి బ్లిస్ సర్కిల్‌లో థర్డ్ ఐ సెక్యూరిటీ సర్వీసస్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహేశ్వరి పరిచయమైంది. ఖర్చుల కోసం తరచూ ఆమె నుంచి డబ్బులు తీసుకుంటున్నాడు. పదేపదే అడుగుతుండడంతో ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసింది. మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. మహేశ్వరిని శివారెడ్డి కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

పుస్తకోత్సాహం

రెండు రోజుల్లో ముగియనున్న 17వ తిరుపతి పుస్తక ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి 17వ పుస్తక మహోత్సవం ఇంకో రెండు రోజులలో ముగుస్తోంది. గురువారం బుక్ ఎగ్జిబిషన్ జరుగుతున్న ఇస్కాన్ మైదానంలో పుస్తకప్రియులు పెద్ద సంఖ్యలో కనిపించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచీ రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన సాగింది. సాయంత్రం పుస్తక ప్రదర్శన వేదికపై నిర్వహించిన సంగీత, సాహిత్య కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి.





పుస్తకమే నిజమైన సంపద
డాక్టర్ మేడసాని మోహన్



ప్రముఖ కవి మౌని రాసిన 'కొండలరాయని సంకీర్తనాతరంగిణి' పుస్తకాన్ని అవధాని మేడసాని మోహన్ ఆవిష్కరించారు. మౌనితో తన అనుబంధాన్ని గుర్తు చేశారు. పుస్తకావిష్కరణలో రచయిత మౌని, ఆముదాల మురళి, దక్షిణామూర్తి పాల్గొన్నారు

పుస్తకం ద్వారా మనిషి పొందే జ్ఞానమే నిజమైన సంపద అని ప్రముఖ అవధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. గురువారం సాయంత్రం అన్నమయ్య వేదిక మీద నుంచి శ్రీవేంకటేశ్వర వైభవం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. శ్రీవారిని అనేక మంది సాహిత్యవేత్తలు కీర్తించారంటూ ఆ వివరాలు చెప్పారు. శ్రీకృష్ణదేవరాయల వంటి రాజు ఏడుసార్లు శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తు చేశారు. అన్నమయ్య వేంకటేశ్వరుడిపై 32వేల సంకీర్తనలు రాశారని తెలిపారు. తాళ్లపాక కవులందరూ సుమారు 50 వేల సంకీర్తనలు రాసి ఉండొచ్చనీ, అయితే వీటిలో కేవలం పద్నాలుగు వేల సంకీర్తనలు మాత్రమే లభ్యమవుతూ ఉన్నాయన్నారు. పుస్తక ప్రదర్శన సంప్రదాయం తిరుపతిలో ఇదే స్ఫూర్తితో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరాజు, దక్షిణామూర్తి శర్మ పాల్గొన్నారు.

నేడు: పర్యావరణంపై సదస్సు

శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పర్యావరణ సంరక్షణ వేదిక పేరుతో చేపట్టే సభలో నగర కమిషనర్ మౌర్య, ఎస్వీయూ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ప్రొఫెసర్ దామోదరం పర్యావరణం గురించి ప్రసంగిస్తారు.

కార్టూన్ పుస్తకాలు చూస్తున్నా..



డ్రాయింగ్, పెయింటింగ్, కార్టూనింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఇందువల్ల ఈ రకమైన పుస్తకాల కోసం బుక్ ఫెయిర్‌లో వెతుకుతున్నాను. ముఖ్యంగా కార్టూనింగ్ పుస్తకాలు కొని చూసి, మంచి కార్టూన్లు వేయాలని ఆశ.

- ఉమాకాంత్‌రెడ్డి, 8వ తరగతి, భారతీయ విద్యాభవన్

నేనేం చదువుతున్నానంటే..:



కలకడ హైస్కూల్లో నేను చదువుకునేటప్పుడు టిప్పు సుల్తాన్ పుస్తకాన్ని మా నాన్న తెచ్చి ఇచ్చి చదవమన్నారు. పడాల రామారావు రాసిన ఈ పుస్తకాన్ని ఇప్పుడు మళ్లీ చదువుతూ ఉంటే ఎంతో ఉద్వేగం కలుగుతోంది. గుర్రంకొండలోని మేనమామ మీర్ రజా అలాఖాన్ వద్ద ఉండి బుఖారీ అనే రష్యన్ సూఫీ గురువు వద్ద టిప్పుసుల్తాన్ చదువుకున్నాడని తెలిసినపుడు ఆశ్చర్యపోయాను. దక్షిణ భారత రాజ సింహంగా తెల్లదొరలే టిప్పు సుల్తాన్‌ను కీర్తించిన విషయాన్ని తెలుసుకొని ఎంతో గర్వించాను.

- కోట పురుషోత్తం, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

పుస్తక ప్రపంచం

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్



విశాలాంధ్ర పేరుతో తెలుగు సాహిత్య రంగంలో ఎంతో పేరుగాంచిన ప్రచురణ సంస్థ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 57వ నెంబర్ స్టాల్‌లో అనేక పుస్తకాలను ప్రదర్శనకు, అమ్మకానికి పెట్టింది. 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో 3 వేలకు పైగా పుస్తకాలను ఈ సంస్థ ప్రచురించింది. సంచార పుస్తక వాహనాలను కూడా విశాలాంధ్ర నడిపిస్తూ ఉంది. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి అభ్యుదయ కవులతో పాటు సింగమనేని నారాయణ, కేతు విశ్వనాథరెడ్డి వంటి రాయలసీమ ప్రాంతీయ నేపథ్యం గల గొప్ప రచయితల కథలు, వ్యాసాలను ప్రచురించింది. తెలుగులోని అనేక కథలు, నవలలు, నాటకాలు, జీవిత చరిత్రలు, ఆత్మకథలు, నిఘంటువులు, పిల్లల పుస్తకాలు, సైన్స్, ఆరోగ్యం, వంటకాలు, ఇంగ్లిషు పుస్తకాలు, అనువాద పుస్తకాలు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో లభ్యమవుతున్నాయి. విశాలాంధ్ర బుక్ హౌస్ తిరుపతి గాంధీ రోడ్డులో ఉంది.

మన పుస్తకం

తిరుపతి కథలు



తిరుపతి పరిసరాల్లోని అనేక చారిత్రక ప్రదేశాలను కథా రూపంలో రికార్డు చేశారు జానపద పరిశోధకుడు ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి ఈ పుస్తకంలో. తిరుపతి గంగ జాతర, తిరువీధులు, తిరుపతి ఐతిహ్యాలు, రాయలసీమ జానపద కళారూపాలు, జానపద శృంగార గేయాలు, తిరుపతి గ్రామ దేవతలు, కొండ కథలు వంటి ఎన్నో పరిశోధనాత్మక పుస్తకాలు ఆయన రాశారు. సినీ గేయ రచయిత భువనచంద్ర, చరిత్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి, టీటీడీ మాజీ ఈవో ఐవైఆర్ కృష్ణారావు ముందుమాటలతో ఉన్న ఈ పుస్తకంలో 108 కథలున్నాయి. 1,120 పేజీల పుస్తకం ధర రూ.750లు. ఎమెస్కో ప్రచురించింది. ఎమెస్కో స్టాల్-13లో లభ్యమవుతుంది.



పుస్తక ప్రదర్శనలో భాగంగా గురువారం సాయంత్రం భారతీయ విద్యాభవన్ విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు. విద్యార్థులు సాయి నిహిత, లక్ష్మీ సంకీర్తన, శైష్ఠజైన్, ఆశినీకృష్ణ, సుదర్శన్, హర్షిత, పూర్ణశ్రీ, లయ, ఆశ్రిత, తరుణి, హేమశ్రీ, కీర్తన, అవంతి, హేమలత, శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

పాఠక స్వరం:

కలాం పుస్తకం కొన్నా..



అబ్దుల్ కలాం అంటే నాకు చాలా అభిమానం. ఈ బుక్ ఫెయిర్‌లో అబ్దుల్ కలాం జీవిత చరిత్ర పుస్తకం కొన్నాను. అబ్దుల్ కలాం గురించి ఏమి విన్నా, చదివినా చాలా మోటివేషనల్‌గా అనిపిస్తూ ఉంటుంది.

- డి.హిమశ్రీ, 9వ తరగతి, శ్రీచైతన్య స్కూల్

ప్రారంభానికి నోచని ఔషధ నియంత్రణ కార్యాలయ భవనం

నిర్మాణం పూర్తయినా ఇంకా అద్దె భవనంలోనే.. ● అడవిని తలపించేలా నూతన భవనం..

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాలం చెల్లిన, నాసిరకం మందుల విక్రయాలను నియంత్రించి ప్రజల ఆరోగ్య భద్రతను రక్షించే ఔషధ నియంత్రణ పరిపాలనా కార్యాలయ నూతన భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడిచిపోయింది. అయినా ప్రారంభానికి నోచుకోక ముళ్ల పొదలతో నిండి అడవిని తలపిస్తోంది. జిల్లా కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఔషధ నియంత్రణ కార్యాలయానికి సొంత భవనం లేక కొన్నేళ్లుగా మంగళం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దె భవనంలో కొనసాగుతోంది. రెండేళ్ల కిందట ఏపీఎంఐడీసీ ఆధ్వర్యంలో రుయాస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ.80 లక్షలతో నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ భవన నిర్మాణం పూర్తయినా ఇంతవరకు ఔషధ నియంత్రణ అధికారులకు అప్పగించకుండా ఏపీఎంఐడీసీ అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీంతో అద్దె భవనానికి నెలకు రూ.14 వేల అద్దె చెల్లించాల్సి వస్తోంది.



ఔషధ నియంత్రణ పరిపాలనా భవనం

ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

తిరుపతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వాటిని ఏర్పాటు చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులతో కలసి గురువారం ఆమె రైల్వే స్టేషన్, జగజ్జీవన్ రామ్ పార్కు ప్రాంతాల్లో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రద్దీ ఎక్కువగా ఉండే రైల్వే స్టేషన్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.రమణ, సర్వేయర్ కోటేశ్వరరావు ఉన్నారు.

మంగళంలో ప్రభుత్వ వ్యాయామశాల ప్రారంభం



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మంగళంలోని సప్తగిరికాలనీ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీవేంకటేశ్వరకాలనీలో అధునాతన వ్యాయామశాల ఏర్పాటు చేశారు. రూ.34 లక్షల తుడా నిధులతో నిర్మించిన ఈ వ్యాయామశాలలో మొత్తం 9 రకాల పరికరాలున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు సైతం అందుబాటులోకి తేవాలని సన్నాహాలు చేస్తున్నారు. ఉచితంగా లేక మినిమం చార్జీలతో నడపాలా అన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. సచివాలయ అధికారులు ఎమ్మెల్యే నిర్ణయం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పోలీసుల అదుపులో బ్యాటరీల దొంగ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో బ్యాటరీలు దొంగలిస్తున్న నిందితుడిని అలిపిరి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. రేణిగుంట రోడ్డులోని ఆటోనగర్‌లో ఒక దుకాణంలో 60 బ్యాటరీలను దొంగలించినట్లు గుర్తించారు. నిందితుడు కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వెటర్నరీ విద్యార్థుల ర్యాలీ.. మానవహారం

నాల్గవ రోజుకు చేరిన సమ్మె



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకారవేతనం(స్టైఫండ్) పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె నాల్గవరోజు గురువారమూ కొనసాగింది. ఉదయం వర్సిటీ ప్రధాన గేటు నుంచి బాలాజీకాలనీ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. బాలాజీకాలనీ సర్కిల్‌కి చేరుకుని మానవహారం చేపట్టారు. విద్యార్థులు మాట్లాడుతూ వైద్యవిద్య కోర్సులు చదివే విద్యార్థులకు నెలకు రూ.20వేలకుపైగా స్టైఫండ్ అందిస్తూ వెటర్నరీ యూజీకి రూ.7వేలు, పీజీకి రూ.9వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10వేలు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ విషయమై 13ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప న్యాయం జరగడంలేదని వాపోయారు. 2022లో సమ్మె చేసినా వైసీపీ ప్రభుత్వం న్యాయం చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని కోరారు.

పోలీసుల సేవలు అమోఘం



పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగమనేది చాలా గొప్పదని, అలాంటి శాఖలో సేవలు అందించడం అమోఘమని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. గురువారం ఉద్యోగ విరమణ పొందిన గాజులమండ్యం స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.సుబ్రమ్మణ్యం, ఎయిర్‌పోర్టు పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జయచంద్రుడులను తిరుపతి పోలీసు అతిథి గృహంలో ఎస్పీ సన్మానించారు. పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం రాత్రి తిరుపతిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బస్టాండులోని లగేజీ కేంద్రాలను పరిశీలించారు. బస్టాండులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. యాత్రికుల పట్ల గౌరవంగా ఉండాలని సూచించారు. రైల్వే స్టేషన్‌లో ఆకతాయిలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుపతిలో విజిబుల్ పోలీసింగ్‌కు పెద్దపీట వేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

అన్నా అనితకు సీఎం అభినందన



తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన కార్పొరేటర్ అన్నా అనితను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. గురువారం మంగళగిరి సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో చాలా బాగా పనిచేశారంటూ అనితను అభినందించారు. భవిష్యత్తులోనూ అందరూ కలిసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సీఎం సూచించినట్లు అనిత తెలిపారు.

మాజీ ఎంపీ వెంకటస్వామికి నివాళి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ వెంకటస్వామి 13వ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు గురువారం తిరుపతిలో నివాళి అర్పించారు. వెంకటస్వామి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాంజలి ఘటించారు.

సబ్సిడీతో సొంతింటికి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : నగరంలో సొంత స్థలం కలిగి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రటరీని కలసి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.



రాఘవేంద్రరావు - శ్రీనివాస్‌రెడ్డి - పులివర్తి నాని, జగన్మోహన్ - వసంత కృష్ణప్రసాద్

తిరుమలలో దర్శకేంద్రుడు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, జగన్మోహన్, పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

12న రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న రామకృష్ణతీర్థ ముక్కోటి జరుగనుంది. తిరుమల కొండల్లో పవిత్రమైన సప్తతీర్థాలుగా స్వామి పుష్కరిణి, కుమారధార, తుంబురు కోన, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, పాండవతీర్థంలను భావిస్తారు. ఇందులో ఒకటైన రామకృష్ణ తీర్థం తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున ఈ తీర్థముక్కోటిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడవీధుల గుండా పూలు, పండ్లు, స్వామి ప్రసాదాలతో శ్రీరామకృష్ణ తీర్థానికి వెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు గనుక ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.


శ్రీహరి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.2.97 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,600

తలనీలాలు సమర్పించినవారు: 19,083



అలుపన్నది ఉందా ఎగిరే అలకు..ఎదలోని లయకు అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినీగీతంలో..రిటైరైనా... ఏడు పదులు దాటినా టెన్నిస్ రాకెట్ వదలని వీరిని చూస్తే ఆ పాటలోని మాటలు వీరికీ వర్తిస్తాయి. వీరి ఉత్సాహం చూసి వయసే వెనుకడుగేస్తుందేమో అనిపిస్తుంది. వృద్ధాప్యం దూరంగా జరిగిపోతోంది. నిరాశ పటాపంచలవుతోంది. జీవిత చరమాంకంలోనూ తరగని క్రీడోత్సాహం ప్రదర్శిస్తున్న ఈ విశ్రాంత ఉద్యోగుల తీరు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమవుతుంది. విశ్రాంత జీవితమంటే కుర్చీలకు, మంచాలకు అంటిపెట్టుకుపోవడమని భావించేవారిని ఉత్సాహపరిస్తుంది. వయసుతో పనిలేకుండా ఆరోగ్యం కోసం ఇప్పటికీ ఆటలాడుతున్న వారిని చూస్తే ఔరా అనిపిస్తుంది. తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్,టౌన్‌క్లబ్‌ల్లో ఇలా టెన్నిస్ ఆడుతున్న కొందరు రిటైర్డ్ ఉద్యోగులను ఒకసారి పలుకరిద్దాం..

- తిరుపతి,క్రీడలు (ఆంధ్రజ్యోతి)

మలిసంధ్యలో మళ్లీ ఆడేద్దాం

- ఏడు పదులు పైబడినా తరగని క్రీడోత్సాహం
- విశ్రాంత జీవితంలో ఉల్లాసంగా..





లాన్‌టెన్నిస్ టోర్నీలో పాల్గొన్న వృద్ధ క్రీడాకారులు

రోగాలు దరిచేరవు....



నేను ఆంధ్రాబ్యాంకులో పనిచేసేవాడిని. మేనేజరు హోదాలో రిటైరయ్యాను. నాకు 76సంవత్సరాలు. చదువుకునే రోజుల నుంచి ఆటల్లో పాల్గొనేవాడిని. రిటైరయ్యాక పడక కుర్చీకి పరిమితం కావడం ఇష్టం లేదు. అందుకు ఆటను వదలలేదు. 60ఏళ్ల టెన్నీస్ ఆడుతున్నా, 40టోర్నమెంట్స్‌లో పాల్గొన్నాను. 18నేషనల్స్ టోర్నీలకు ప్రాతినిధ్యం వహించాను. బహుమతులు సొంతం చేసుకున్నా. రోజు ఏదో ఆటలాడితే అనారోగ్యం దరిచేరదు. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. అందరూ తీరిక సమయంలో క్రీడల్లో పాల్గొంటే చాలా మంచిది.

- ఎన్.సి.అశోక్‌రెడ్డి తిరుపతి

రిటైర్మెంటు వయసుకు మాత్రమే..



ప్రొఫెసరుగా రిటైరయ్యాను. ఇప్పుడు 78ఏళ్లు. ఎప్పుడూ ఆధారపడే మనస్తత్వం ఉండకూడదనుకుంటాను. మనసులో ఉత్సాహం ఉంటే లైఫ్ బాగుంటుంది. ఇందుకు క్రీడలు బాగా సహకరిస్తాయి. నా విషయంలోనే ఇదే కరెక్టయింది. రోజూ గంటపాటు టెన్నిస్ ఆడుతా. వాస్తవానికి నేను ఆహారం విషయంలో పెద్దగా నియమాలను పాటించను. చలాకీగా ఉంటాను. రిటైర్మెంటు వయసుకే గాని మనసుకు కాదని నమ్ముతాను. ఇప్పటివరకూ ఎలాంటి అనారోగ్య సమస్య ఎదురుకాలేదు. నేటి యువత కూడా క్రీడలపట్ల శ్రద్ధ చూపాలి. చదువు, ఆటల వల్ల క్రమశిక్షణ అలవాటవుతుంది.

- సి.రఘునాథరెడ్డి, నర్సింగాపురం

రోజూ ఆడటం వల్లే యాక్టివ్‌గా ఉన్నా...



ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసి రిటైరయ్యాను. నా వయసు 73ఏళ్లు. గడచిన 45 సంవత్సరాలుగా ఉదయం, సాయంత్రం స్నేహితులతో కలసి కనీసం రెండు గంటలపాటు టెన్నీస్ ఆడుతాను. రోజూ ఆడటం వల్లే యాక్టివ్‌గా, ఫిట్‌గా ఉన్నానని నమ్ముతున్నా. షుగర్, బీపీలాంటివేవీ లేదు. ఎప్పుడైనా చిన్నపాటి దెబ్బలు తగిలినా టెన్నీస్ వదల్లేదు. ఈ తరం పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెరగాలి. తల్లిదండ్రులు,స్కూలులో ఇందుకు ప్రోత్సహించాలి.

- హనుమంతరావు, తిరుపతి

ఆటలతో ఆయుష్షు పెరుగుతుంది.

బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి రిటైరయ్యాను. గత 30ఏళ్లుగా టెన్నీస్ ఆడుతున్నా. ఎన్నో టోర్నీలో పాల్గొని రాణించాపే. ఆటల వల్ల ఆయుష్షు పెరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలవైపు ప్రోత్సాహించాలి. మానసిక వికాసం, దేహ దారుఢ్యం లభిస్తుంది. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం అలవడువుతుంది. మనసు ధృడంగా ఉంటుంది. పోటీతత్వం పెరిగితే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయవచ్చు.

- యు.ఆనందకేశవులు, తిరుపతి



గోదాములో రేషన్‌బియ్యం



ఏడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి శివారులోని ఈదులగుంటలో అక్రమంగా ఉంచిన ఏడు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో స్పెషల్‌బ్రాంచ్ పోలీసులు గురువారం రెక్కీ నిర్వహించారు. వీరి సమాచారంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, టూటౌన్ పోలీసులను అప్రమత్తం చేశారు. వాళ్లు అక్కడికి చేరుకుని ఆటో సహా గోదాములోని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి ఏడు టన్నుల బియ్యం ఉన్నట్లు తెలిపారు. సివిల్‌సప్లయిస్ గోదాముకు తరలించారు. రేషన్‌బియ్యం అక్రమార్కుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పోకూరు గంగాధరం అనే యువకుడు రేషన్‌బియ్యం స్మగ్లింగ్ చేస్తూ పలుమార్లు పట్టుబడ్డాడు. కేసులూ ఉన్నాయి. ఈ రేషన్ బియ్యం కూడా అతడిగా అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. ఇతడితో పాటు శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన ఓ యువకుడు, వీరికి ముఠా నాయకుడిగా తిరుపతికి చెందిన ఓ మద్యం వ్యాపారి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పూర్తిగా విచారించి రేషన్‌బియ్యం స్మగ్లింగ్ వెనుక ఉన్న వారి వివరాలను వెల్లడిస్తామని టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



గోదాము వద్ద రేషన్‌బియ్యం తరలిస్తున్న ఆటో

రాత్రి గస్తీ పటిష్ఠ పరుస్తాం

పాత నేరస్తుల కదలికలపై నిఘా

ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలు అరికట్టడానికి రాత్రి గస్తీలు, డైనమిక్ బీట్లపై పునఃసమీక్షించి పటిష్ఠపరుస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. 'యూపీ ముఠా పనేనా?' అంటూ వరుస దొంగతనాలకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఐదేళ్లలో జరిగిన దొంగతనాలు, దోపిడీలు, ఇతర ఘటనలను సమీక్షించి, ఎక్కడెక్కడ ఎక్కువగా.. ఏ సమయాల్లో.. ఎలాంటి దొంగతనాలు జరిగాయి? ఎవరి పాత్ర ఉందేది అధికారులతో సమీక్షిస్తామన్నారు. అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది కొరత, వారం రోజులుగా వివిధ బందోబస్తు విధుల్లో ఉన్నందున బీట్లపై కొంత నిఘా తగ్గిందని అన్నారు. జిల్లాలోని పాత నేరస్థులు, అనుమానితుల వేలి ముద్రలు, ఫొటోలు సేకరించే పని వేగవంతం చేశామన్నారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 80 మంది నేరస్థుల వేలి ముద్రలు సేకరించినట్లు ఆయన చెప్పారు. శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, అక్కడక్కడ రోడ్ల పక్కన గుడిసెలు వేసుకుని ఉంటున్న వారిపైనా నిఘా పెంచుతామన్నారు. తిరుపతిలో సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలించి అవసరమైన చోట్ల కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడైనా పాత నేరస్తులు, అనుమానితులు తిరుగుతుంటే సమీప స్టేషన్లకు, లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

10న ముగియనున్న కుంభమేళా బుకింగ్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా ప్రత్యేక టూర్ ప్యాకేజీ టికెట్ బుకింగ్‌కు ఈ నెల 10వ తేదీతో గడువు ముగియనుందని డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న ఉదయం 5 గంటలకు శ్రీనివాసం నుంచి బయల్దేరనున్న ఏపీ బస్సులో 45సీట్లకుగాను 24 రిజర్వేషన్ అయ్యాయని, 21మిగిలి ఉన్నాయని తెలిపారు. పోను, రాను ఛార్జీలు పెద్దలకు రూ. 22వేలు, పిల్లలకు(3నుంచి 10సంవత్సరాల లోపు వయస్సు) రూ.19వేలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. మార్గమధ్యలో ఒంటిమిట్ట, బాసర, జబల్పూర్, చిత్రకూట్, ప్రయాగరాజ్, వారణాసి, నాగపూర్, ధర్మపురి, మహానంది తదితర ప్రాంతాలను చూపుతారని తెలిపారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు పీ4 పాలసీని అమలు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల్లో పేదరిక నిర్మూలనకు పీ4(పబ్లిక్, పీపుల్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) అమలుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి సీఎస్ పీ4పాలసీతో పాటు పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. సీఎస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో పది సూత్రాల అమలుకు, రాష్ట్రంలో వృద్ధిరేటు సాధనకు, పేదరిక నిర్మూలనకు ప్రణాళికల తయారు చేసి, అమలు చేయాలన్నారు. అందుకోసం శుక్రవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహంచాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం వెల్లడించారు. ఎరికంబట్టు హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ టి.వెంకటరమణ, తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ టి.కృష్ణయ్య పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు ఇటీవల ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. విచారణ జరిపించామని, నివేదికల ఆధారంగా క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో వెల్లడించారు.

బీసీ రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడవును పెంచడం జరిగిందని, అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైద్యశాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, శ్రీపద్మావతీ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు సంబంధించి పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఎస్వీ వైద్య కళాశాలలో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను, ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.



ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఉపాధ్యాయురాలి మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన గురువారం మర్రిగుంట వద్ద చోటుచేసుకుంది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు గౌరీనగర్‌కు చెందిన కరీమునిసా బేగం పాపానాయుడుపేట జడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం తన ద్విచక్ర వాహనంపై పాపానాయుడుపేటకు వెళుతుండగా మర్రిగుంట మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో తిరుపతి నుంచి ముసిలిపేడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయురాలి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గురుదక్షిణామూర్తికి బంగారు రుద్రాక్షహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ బొప్పల ఝాన్సీ లక్ష్మీబాయి రూ.8లక్షల విలువైన 32 పంచముఖ రుద్రాక్షల బంగారు హారాన్ని వితరణ చేశారు. దీనిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో రామాంతపూర్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల

నాయుడుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి రామాంతపూర్‌కు వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్ తొలిసారిగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్‌కు గురువారం ఆమోదం పొందింది. తొలిసారిగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఉదయం 8.18 నిమిషాలకు స్టాపింగ్ కావడంతో డీఆర్‌యూసీసీ సభ్యుడు పేర్నాటి జోసెఫ్, రైల్వే బోర్డు మెంబరు చిగురాకుల సురేంద్ర, నాయుడుపేట సదరన్ రైల్వే వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మస్తాన్, ఉపాధ్యక్షుడు రాఘవన్, కె. కిరణ్, స్టేషన్ మాస్టర్ చిరంజీవి తదితరులు రైల్వే డ్రైవర్లను సత్కరించారు. రామాంతపూర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తూ నాయుడుపేటలో ప్రతి శనివారం రాత్రి 12.13 నిమిషాలకు నిలుపుదల ఉంటుందని వారు తెలియజేశారు.



అభినందనలు తెలియజేస్తున్న డీఆర్‌యుసీసీ సభ్యులు జోసెఫ్, మస్తానయ్య, రవి, తదితరులు

రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా

- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని సంస్థ సీఎండీ కె.సంతోష్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీమలో సాగుకు ఏడు గంటలే కరెంట్ అనే శీర్షికపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. సంస్థ పరిధిలో ఉన్న తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో రైతుల అవసరాల మేరకు 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. చీఫ్ జనరల్ మేనేజరు(ఆపరేషన్) జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చే క్రమంలో సమయ గణాంకాల్లో పొరపాటు దొర్లిందని పేర్కొన్నారు.

జగనన్న కాలనీల్లో నకిలీ పట్టాల బాగోతం

- పూర్వ డీటీతోపాటు మరో ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో నకిలీ పట్టాల బాగోతం వెలుగు చూస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్వ డిప్యూటీ తహసీల్దారుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. 2022లో తిరుపతి జీవకోనకు చెందిన బుజ్జమ్మ, చెంచయ్య, అహ్మద్, మల్లిషావలి అనే వారికి రేణిగుంట మండలం కుర్రకాల్వ, అడుసుపాళెం, తారకరామనగర్‌లో జగనన్న ఇంటి పట్టాలు ఇప్పిస్తానని రేణిగుంటలోని కొంతమంది దళారులను కలిసి అప్పటి ఓ అధికారి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. వారి నుంచి ఒక్కో ఇంటి పట్టాకు రూ.1.8 లక్షల చొప్పున రూ.7.20 లక్షలను రెండు విడతలుగా తీసుకున్నట్లు విమర్శలున్నాయి. ఈ రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు రూములో భద్రపరచిన ఖాళీ జగనన్న పట్టాలకు రెవెన్యూ సిబ్బంది చేత కొనుగోలుదారుల పేరు రాయించి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా పట్టాలు ఇచ్చేసినట్లు వారికి చెప్పారు. ఆ సమయంలో వారికి స్థలాలు చూపలేదు. ఆ తర్వాత కొనుగోలుదారులు కంప్యూటర్ ఆపరేటర్ శశికళ, నకిలీ వీఆర్వో తనిష్కా, సుబ్రమణ్యం అనే దళారిని పలుమార్లు కలిసి నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వారు తహసీల్దారు కార్యాలయంలో విచారించగా ఆ పట్టాలు బోగస్‌గా తేలడంతో మోసపోయామని గుర్తించారు. దీనిపై రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శశికళ, నకిలీ వీఆర్వో తనిష్కా, దళారి సుబ్రమణ్యంపై ఐపీసీ 468, 471, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై తహసీల్దారు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది.

గ్రావెల్ టిప్పర్ సీజ్ : యజమానిపై కేసు నమోదు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను తొట్టంబేడు పోలీసులు సీజ్ చేశారు. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన ప్రకారం.. శివనాథపాళెం పరిసరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో శివనాథపాళెంలో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం రాత్రి స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం తహసీల్దారు మధుసూదన్‌రావుకు వాహనాన్ని అప్పగించినట్లు తెలిపారు. తాము వెళ్లేలోగా ఘటనా స్థలంనుంచి ఎక్స్‌కవేటర్ వెళ్లిపోయినట్లు ఎస్ఐ చెప్పారు. అక్రమంగా గ్రావెల్, ఇసుక తరలించే వాహనాలను గతంలో న్యాయస్థానానికి అప్పగించేవారు. ఇటీవల కొంతకాలంగా రెవెన్యూ అధికారులకు అప్పగిస్తుంటంతో అక్రమార్కులు మళ్లీ మళ్లీ తవ్వకాలకు తెగబడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తిరుపతికి చెందిన సత్యం ఐఐటీ అకాడమీ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక గాయత్రి పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, రాధయ్య, కేఆర్‌రెడ్డి, చంద్రమోహన్, రాఘవరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తడ కండ్రిగ సచివాలయం తనిఖీ


హాజరుపట్టికను తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈవో రామమోహన్‌రావు

తడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తడ కండ్రిగ సచివాలయాన్ని నెల్లూరు జెడ్పీ డిప్యూటీ సీఈవో రామమోహన్‌రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'సచివాలయాలలో సిబ్బంది ఏరి' అనే కథనం బుధవారం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన ఆయన సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరుపట్టికను తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేల వివరాలను అడిగి తెలుసుకొని వీలైనంత త్వరగా ఆ సర్వే పనులను పూర్తిచేయాలంటూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ మేరకు అయా రిజిస్టర్లను తనిఖీలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో విజయకుమార్, తడకండ్రిగ పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్, ఇతర సిబ్బంది ఉన్నారు.

తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు


మెప్మా మహిళల ఉత్పాదనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ

నాయుడుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మెప్మా మహిళలు తయారు చేసే వివిధ రకాల నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరకే లభిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట గాంధీ మందిరం పార్కు వద్ద మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. పొదుపు సంఘాలను బలోపేతం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం గెరిడీవీధిలోని ఆల్కలిన్ వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, ముత్యాలయ్య, హైమావతి, సునీత, గంగరాజు తదితరులు ఉన్నారు.

విన్నమాలలో తాగునీటి పథకం ఏర్పాటు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని విన్న మాలలోని ఎస్టీ కాలనీలో తాగునీటి పథకాన్ని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెల వల సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. గతంలో విన్నమాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. స్పందించిన ఆయన ఆ ప్రాంతంలో సీసీ రోడ్డు, తాగునీటి బోరు పథకానికి నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి దార్ల రాజేంద్ర, నాయకులు మధురెడ్డి, రవి, రాజారెడ్డి, సంచికృష్ణయ్య, శ్రీనివాసులు, దినేష్, ముత్యాలయ్య, శ్రీకాంత్, బంగారునాయుడు, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గ్యాస్ పైప్‌లైన్ మీదుగా తవ్వకాలు నిషేధం

ఓజిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలం పెద్ద పరియ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటైన ఉన్న గ్యాస్ స్టేషన్ పరిధిలోని పైప్‌లైన్ మీదుగా తవ్వకాలు ప్రమాదకరమని యాజమాన్యం గురువారం హెచ్చరించింది. ఇక్కడి నుంచి నాయుడుపేట, అత్తివరం, మేనకూరు సెజ్, గూడూరు ప్రాంతాలకు గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ పైప్‌లైన్ మీదుగా ఎవరూ అనుమతి లేకుండా తవ్వకాలు, కట్టడాలు చేపట్టరాదు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామనియాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చు


మాట్లాడుతున్న ఆర్టీవో కిషోర్

గూడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించ వచ్చునని రవాణాశాఖ అధికారి కిషోర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అతివేగంగా, మద్యం సేవించి నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎంవీఐ సునీల్, ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

కోట ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు

కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రిలో గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘ వేంద్రమీన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దారు జయజయరావుతో కలిసి వైద్యుల గదులు, హాజరుపట్టీలు తనిఖీలు చేశారు. మందులను, స్కానింగ్ యంత్రాలను, బెడ్లను పరిశీలించారు. డాక్టర్ జోస్మప్రియారావులతోపాటు పలువురు డాక్టర్లు, సిబ్బంది పనితీరు గురించి రోగుల వద్ద విచారించారు. నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం కర్లపూడి ప్రాంతంలోని సాగరమాల రోడ్డు పనులను పరిశీలించారు. ఆర్ఐ మధులత ఉన్నారు.

పూరిల్లు దగ్ధం

కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో కుడుమల చిన్నఅంకయ్యకు చెం దిన పూరిల్లు గురు వారం అగ్నికి ఆహుతైంది. ఇంటికి తాళంవేసి అంకయ్య తన భార్యతో కలసి పొలం పనులకు వెళ్లాడు. ఇంట్లో వెలుగుతున్న దీపం బుడ్డులు వలికి మంటలు రేగి పూరిల్లును తాకాయి. స్థాని కులు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. పూర్తిగా ఇల్లు కాలి బూడిదైంది. నిరాశ్రయు లైన చిన్న అంకయ్య కుటుంబానికి టీడీపీ ఎస్సీసెల్ నాయకులు యాకశిరి చిన్నయ్య 25 కేజీల బియ్యం, రూ.2వేల నగదు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో

మీనమేషాలు..!

- ప్రైవేటు విక్రయాలే శరణ్యం
- నష్టపోతున్న రైతులు

ఓజిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యం మార్కెట్‌లో విక్రయించే క్రమంలో రైతులు పడుతున్న అవస్థలు, నష్టాలను నివారించి వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొన్నేళ్ళుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. దీంతో రైతులు ప్రైవేటు వ్యక్తుల మోసాలనుంచి తేరుకున్నట్లైంది. అయితే ఈ సీజనులో ఓజిలి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటులో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు పొదుపు గ్రూపుల ద్వారా నిర్వహిస్తుండగా దానిని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు అప్పగించారు. సజావుగా జరుగుతున్న దానిని సవరిస్తూ గత వైసీపీ ప్రభుత్వం సహకార సంఘంతోపాటు రైతు భరోసా కేంద్రాలకు కూడా బాధ్యతను పంచింది. దీంతో ఇప్పటి వరకు ఎవరు ఏ బాధ్యత చేపట్టాలో సరైన విధానం, సూచనలు అందక ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్ట త రాలేదని అధికారులు అంటున్నారు. ఫలితంగా ఆరుగాలం శ్రమించి రైతు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైతులు గిట్టుబాటు ధరతోపాటు తూకంలోనూ నష్టపోవాల్సి వస్తోంది. ఓజిలి మండలంలో ఇప్పటికే ఎలిది పంట చేతికి వచ్చి ధాన్యం విక్రయా లు జరుగుతున్నాయి. ఈ పంటను నేరుగా ప్రభు త్వం నిర్ణయించిన ధరతో విక్రయాలు చేపట్టేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఓజిలిలోని రైతు భరోసా కేంద్రం

ధరపై రైతులు అసంతృప్తి...

మండలంలో ప్రస్తుత సీజనులో సాగుచేసిన ఆర్ఎన్ఆర్(షుగర్‌లెస్), బీపీటీ-5204, కెఎన్ ఎం-1638 రకాల పంట చేతికి వస్తోంది. ఈ పంటకు వరుసగా రూ. 19750, రూ.20వేలు, రూ.18 800ల వంతున దళారులు ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో రైతులు గిట్టుబాటు ధర లేకపోయినా ప్రత్యామ్నాయం లేక ఈ ధరకే విక్రయాలు కొనసాగిస్తున్నారు.

ఎలిది పంట దిగుబడులు తగ్గాయి...

మండలంలో ఈ పర్యాయం ఎలిది పంట దిగుబడి బాగా తగ్గిపోయిందని అంటున్నారు. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల ధాన్యం మాత్రమే దిగుబడిగా వస్తోందని పేర్కొంటున్నారు. వచ్చిన పంటకు కూడా సరైన ధర లేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

తేమ శాతం పేరుతో కోత...

గిట్టుబాటు ధర లేకపోయినా ఇప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు విక్రయాలు చేస్తున్నారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు తేమ శాతం పేరుతో కోత పెడుతున్నారు. ధాన్యం 75 కిలోల బస్తాకు తేమ, గోనె సంచి వంటి వాటిని కలిపి మొత్తంగా నాలుగు నుంచి 6 కిలోల వరకు తరుగు కింద తీసివేస్తున్నారు. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

గూడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, నియోజకవర్గంలో పెండింగ్ పనులపై చర్చించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఏరియా ఆస్పత్రి అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

నియోజకవర్గ పరిధిలోని పలు గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.94.56 లక్షలు నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. కోటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల మరమ్మతులకు రూ.35.80 లక్షలు, చిట్టేడులోని బాలికల వసతిగృహానికి రూ. 10 లక్షలు, మల్లాంలోని బాలుర వసతిగృహానికి రూ. 18లక్షలు, చిట్టమూరు బాలుర వసతిగృహానికి రూ.13.72లక్షలు, గునపాడు గ్రామంలోని బాలుర వసతి గృహానికి రూ. 8లక్షలు, కోటలోని జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలకు రూ.8.9లక్షలు నిధులను మరమ్మతుల నిమిత్తం మంజూరు చేశారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ఎంపీ మాగుంట కోలుకోవాలని చెంగాళమ్మకు పూజలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి త్వరగా కోలుకోవాలంటూ గురువారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి అనుచరులు పూజలు చేశారు. చెన్నై అపోలో వైద్యశాలలో మాగుంటకు గుండె శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. ఈ నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకోవాలంటూ వేనాటి అను చరులు, మాగుంట అభిమానులు పూజలు చేశారు. 108 కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో కేవీ రెడ్డి, వేనాటి సుమంత్ రెడ్డి, మార్కేండేయులు, పామంజి వెంకట్, మునిరామయ్య, రామ్మూర్తి పలువురు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరి కాయలు కొడుతున్న అభిమానులు

మద్యం స్వాధీనం ఒకరి అరెస్టు

కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తిరు మూరు భాస్కర్ వద్ద 9 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి) : వరికి మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర రైతు కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. గురువారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఐస్‌క్రీమ్ ఆటోను ఢీకొనడంతో ఐస్‌క్రీమ్ విక్రయదారుడు చెల్లా వెంకటకృష్ణయ్య (58) మృతి చెందాడు. బాలయపల్లి మండలం గొల్లగుంట గ్రామానికి చెందిన వెంకటకృష్ణయ్య కొంతకాలంగా సూళ్లూరుపేట, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆటోలో ఐస్‌క్రీమ్ విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపో సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఐస్‌క్రీమ్ ఆటోను ఢీకొనడంతో ఆయన తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. హైవే అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పుత్తూరు వార్తలు

సమగ్ర వివరాలిస్తేనే

'స్వయం' రుణాలు

- మెప్మా పీడీ రవీంద్ర వెల్లడి

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలను నియంత్రించేందుకు ఉన్నతాధికారులు సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పీడీ స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ఏర్పాటు మొదలు నేటి వరకు సభ్యుల వివరాలు, తీసుకున్న రుణాలు, చెల్లించిన రుణాలు తదితర అంశాలను నమోదు చేసే ప్రొఫైలింగ్ ప్రక్రియను తప్పనిసరిగా చేయాలని అన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 10వ తేదీ లోపు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. నమోదు చేసుకోని సంఘాలకు రుణ మంజూరు ఉండదని స్పష్టం చేశారు. మహిళలను పొదుపు వైపు మళ్లించడంతో పాటు ఆ కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం, ఆర్థిక క్రమ శిక్షణ వైపు నడిపించడం స్వయం సహాయక సంఘాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సంఘాల ద్వారా పొందిన రుణాలతో పలువురు మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకున్నారని తెలిపారు. గతంలో రుణాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ బ్యాంక్ వారు రుణాలు మంజూరు చేసే విధానం ఉండేది.. ఇకపై రుణం చెల్లించిన వారికే రుణాలు ఇచ్చే విధానం అమల్లోకి రానుందన్నారు. మహిళా సంఘాలే కాకుండా రవాణా విభాగం కార్మికులు, భవన కార్మికులు, శానిటరీ వర్కర్లు తదితర వృత్తిదారులతో సంఘాలుగా ఏర్పాటు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, ప్రమీల, మనోహర్‌రెడ్డి, టీఎంసీ సునీత తదితరులు పాల్గొన్నారు.


స్వయం సహాయక సంఘ సభ్యులతో మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

గృహహింస కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

వడమాలపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజోతి): గృహహింస, అదనపు కట్న వేధింపుల కేసులో ముగ్గురికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. పత్తి పుత్తూరు పంచాయతీ అమ్మగుంట గ్రామానికి చెందిన శ్రీవాణి 2016లో తన భర్త మదనమోహన్ రెడ్డి, అత్త నాగమ్మ, ఆడబిడ్డ రాజ్యలక్ష్మి, మామ సుబ్బారెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, గృహ హింసకు పాల్పడుతున్నారని వడమాలపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు కాగా పుత్తూరు కోర్టులో విచారణ సాగింది. 2019లో మదనమోహన్ రెడ్డి మృతి చెందగా మిగిలిన ముద్దాయిలైన నాగమ్మ, రాజ్యలక్ష్మి, సుబ్బారెడ్డిలకు పుత్తూరు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ మూడు సంవత్సరాల జైలుశిక్ష, ఇద్దరు మహిళలకు రూ.8000 చొప్పున, సుబ్బారెడ్డికి రూ.9000 అపరాధ రుసుం విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ నిర్మల కేసు వాదించారు.

నిజాయితీగా రికార్డులు ఉన్న రైతులకు న్యాయం చేస్తాం

- తిరుపతి ఆర్డీవో రామ్మోహన్

వడమాలపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నిజాయితీగా రికార్డులు ఉన్న రైతులకు న్యాయం చేస్తామని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ చెప్పారు. టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన పాదిరేడు అరణ్యం భూముల రైతులకు సంబంధించిన రికార్డులను గురువారం వడమాలపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం భూములు కోల్పోయిన రైతుల బకాయిలకు సంబంధించి గత ప్రభుత్వంలో చేసిన తప్పుఒప్పులను, రికార్డులను పరిశీలించారు. సుమారుగా 52 ఎకరాలకు సంబంధించి రైతులకు బకాయిల చెల్లింపు వివరాలు సేకరించారు. సదరు భూముల్లో చెట్లు, బోర్ల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్రంగా నివేదిక ఇవ్వాల్సిందిగా తహసీల్దార్ జరీనాను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానీ బాషా, రైతులు పాల్గొన్నారు.


మాలధారణకు తయారుచేసిన వస్త్రాలు


దేవుడి అలంకరణ వస్త్రాలు

నగరి వస్త్రాలకు

ఆధ్యాత్మిక సౌరభాలు!


కొత్తపేటలో వస్త్రాల తయారీ


విగ్రహాలకు చుట్టే వస్త్రాలు

కాటన్ చొక్కాల నుంచి ఉత్సవాల వస్త్రాల దాకా నేతన్న ప్రస్థానం

నగరి, ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు అంటే 50యేళ్ల క్రితం నూలు వస్త్రాల తయారీకి నగరి ప్రసిద్ధి. నగరి కాటన్ చొక్కాలు,ప్యాంట్లు,చీరలకు మన దేశంలోనే కాదు విదేశాల్లోనూ ఎంతో డిమాండు వుండేది.దేశంలో గుజరాత్ తర్వాత మరమగ్గాలు వాడిన ప్రాంతంగా 1976లోనే నగరి నేతపరిశ్రమ పేరుగాంచింది. కొత్తపేట,ఏకాంబరకుప్పం ప్రాంతాల్లో తయారయ్యే కాటన్ చొక్కాలు, కాటన్ చీరలకు విదేశాల్లో కూడా డిమాండు వుండేది.అమెరికా,జపాన్ దేశాలతో పాటు యూరప్ దేశాల నుంచి కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు నగరికి వచ్చి నూలు వస్త్రాలకు ఆర్డర్లు ఇచ్చేవారు. నగరి, పుత్తూరు, నారాయణవనంలో వున్న ఉత్పత్తిదారులు విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు.మాంగాడు పట్టుచీరలకు, నూలు చీరలకు ప్రసిద్ధి గాంచింది. షర్టు బిట్ల తయారీలో పేరు గాంచిన నగరి నేతగాళ్లు 1990 తర్వాత నూలు రేట్లు పెరగడం, ఎగుమతులపై అంక్షల కారణంగా విదేశీ ఆర్డర్లు తగ్గిపోవడంతో చుడీదార్ల తయారీపై మొగ్గు చూపారు.ప్రస్తుతం చుడీదార్లతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన వస్త్రాల తయారీలో ముందడుగు వేస్తున్నారు.

వస్త్రాల తయారీలో పవిత్రతకు ప్రాధాన్యం

వివిధ ఆలయాల్లో కుంభాభిషేక కార్యక్రమాలకు ఉపయోగించే దుస్తులన్నీ ప్రస్తుతం నగరిలోని చింతలపట్టెడ,కొత్తపేట, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట,సత్రవాడ ప్రాంతాల్లో మొదలియార్ల చేతులమీదుగా తయారవున్నాయి. ప్రధాన ఆచార్య వస్త్రాలు, సాదిక వస్త్రాలు, వాస్తు వస్త్రాలు, పరివట్టం, కుంభాభిషేకం చీరలు, రవికలు, వినాయక విగ్రహాలకు కట్టే పంచెలు, కలశాలపై ఉంచే దుస్తులను అవసరమైన వారు ఇక్కడ కొనుగోలు చేస్తున్నారు.అలాగే అయ్యప్ప దీక్షకు వాడే నలుపు, నీలం, కాషాయ రంగు వస్త్రాలు, గోవిందమాలకు వాడే పసుపు, సుబ్రమణ్య స్వామి దీక్షకు వాడే పచ్చరంగు వస్త్రాలు, ఓంశక్తి, ఆదిపరాశక్తి అమ్మవారికి వాడే ఎరుపు రంగు వస్త్రాలను కూడా ఇక్కడ తయారుచేస్తున్నారు.వస్త్రం కొలతను అనుసరించి రోజుకు 15 నుంచి 20 వస్త్రాలు ఒక మగ్గంలో తయారవుతాయి.ఈ వస్త్రాలు తయారుచేసే సమయంలో పవిత్రతకు ప్రాధాన్యం ఇస్తారు.స్నానం చేయకుండా పనిలోకి దిగరు. మద్యం, మాంసాహారం జోలికెళ్లరు.బంధువులెవరైనా మరణించి అంటు వున్న సమయంలో వస్త్రాలు నేయడం మానేస్తారు.


కుంభాభిషేకానికి వాడే వస్త్రాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు దుస్తుల సరఫరా

నగరి ప్రాంతంలో నేసే ఆధ్యాత్మికపరమైన కార్యక్రమాల్లో ఉపయోగించే వస్త్రాలకు మన రాష్ట్రంతో బాటు తమిళనాడులోనూ మంచి గిరాకీ వుంది.తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కుంభకోణం, తంజావూరు, మదురై, పళని, చిదంబరం, తిరువణ్ణామలై, కాంచీపురం, తిరుచ్చి, కన్నియాకుమారి, తిరుచందూర్, నాగర్‌కోవిల్ తదితర ఆలయాల్లో జరిగే వేడుకలకు ఇక్కడినుంచే వస్త్రాలు తీసుకెళతారు. వ్యాపార కేంద్రాలైన చెన్నై, ఈరోడ్డు ప్రాంతాలకు చెందినవారు ఇక్కడినుంచే ఆధ్యాత్మిక వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మూడు ఆలయాల్లో చోరీ


ఆలయాల్లో పగులగొట్టిన హుండీ, తలుపులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నీరువాయి గ్రామానికి చెందిన మూడు ఆలయాల్లో బుధవారం రాత్రి దొంగలు పడి నగదు, నగలు దోచుకెళ్లారు. వివరాలు ఇలా... గ్రామంలోని ఈశ్వరాలయంలో హుండీ పగులగొట్టి సుమారు రూ.10వేలకు పైగా నగదు దొంగతనం జరిగింది. అలాగే గ్రామానికి చెందిన అంకాళపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి మంగళసూత్రంతో పాటు హుండీని పగులగొట్టి రూ.2వేల నగదు దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన బీసీ కాలనీ ఓంశక్తి గుడిలో అమ్మవారి మంగళ సూత్రంతో పాటు హుండీని పగులగొట్టి రూ.10వేలు నగదు దొంగిలించుకెళ్లారు. గత వారం రోజుల క్రితమే పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో నాగాలమ్మ దేవాలయం, రెప్పలపట్టు కొత్త నాంచారమ్మ దేవాలయాల హుండీలను పగులగొట్టి డబ్బు పట్టుకెళ్లారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికంగా ఉన్న జనం భయంతో హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పటిష్ఠ నిఘా ఉంచి, రాత్రి పూట గస్తీని ముమ్మరం చేసి దొంగల ఆట కట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం


అర్జీలు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో ఇల్లు లేని పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీమేరకు పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 10న జిల్లా వ్యాప్తగా అన్ని మండల కార్యాలయాల వద్ద ఇంటి స్థలాల బాధితులతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఇందుకు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, గోపి, చారులత, శీను, చందు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 30మంది ఎంపిక


ఎంపికైన వారితో అధ్యాపకులు తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన జాబ్‌మేళాలో 30మంది ఎంపికయ్యారు. జేకేసీ ఆధ్వర్యంలో రెండు పరిశ్రమల వారు ఈ జాబ్‌మేళాను నిర్వహించారు. ఇందులో 45మంది అభ్యర్థులు హాజరుకాగా, ఇంటర్వ్యూలు నిర్వహించి 30మందిని ఎంపిక చేశారు. వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, జేకేసీ కోఆర్డినేటర్ గంగారామ్, అధ్యాపకులు గిరిజమ్మ, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డిని కందాటి శేఖర్‌రెడ్డి కోరారు. తిరుపతిలో గురువారం ఆయనను కలిసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. కోనేరు, రోడ్డు విస్తరణ తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌రెడ్డి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీ మండల అధ్యక్షుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మునిచంద్రారెడ్డి తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి తల్లి ఆనందమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గాజులమండ్యం గ్రామంలోని మునిచంద్రారెడ్డి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మినీవ్యాన్, ద్విచక్ర వాహనం ఢీ
- ఒకరి మృతి


ఘటనా స్థలంలో మినీవ్యాన్ - ద్విచక్ర వాహనం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మినీ వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బీఎన్‌కండ్రిగ మండలంలో చోటు చేసుకుంది. బీఎన్‌కండ్రిగ ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు కథనం మేరకు తొట్టంబేడు మండలం బసవన్నకుంట గ్రామానికి చెందిన హరికృష్ణ(24) సొంత పనుల నిమిత్తం గురువారం బీఎన్ కండ్రిగకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి శ్రీకాళహస్తి వైపు బయలుదేరాడు. బీఎన్‌కండ్రిగవైపు వస్తున్న ఓ మినీ వ్యాన్ మండలంలోని చల్లమాంబపురం చెరువు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. బీఎన్‌కండ్రిగ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మన్న సముద్రం సమీపంలోని కొండరాయుడు చెరువులో గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని ఏర్పేడు పోలీసులు గురువారం గుర్తించారు. ఇతడు 20 రోజుల క్రితం చేపలు పట్టడానికి వచ్చి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈవ్యక్తి నల్లప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏర్పేడు పోలీసులను సంప్రదించాలని సీఐ జయచంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలు సాగిస్తున్న జేసీబీ సీజ్


రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న జేసీబీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగ వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న జేసీబీని అధికారులు సీజ్ చేశారు. పుల్లారెడ్డికండ్రిగ పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో గత కొద్దిరోజులుగా రాత్రి వేళ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు పుల్లారెడ్డి కండ్రిగ చేరుకుని జేసీబీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

రెండు భారీ వాహనాలు స్వాధీనం

కేవీబీపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏజీఎస్ ఇన్ఫోటెక్ పరిశ్రమకు చెందిన రెండు అతి భారీ వాహనాలను అధిక లోడుతో వస్తుండటంతో శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్ నాయుడు గురువారం సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు తగిన లోడ్‌తో మాత్రమే రావాలన్నారు. అధిక లోడ్‌తో, పర్మిట్లు లేకుండా రోడ్లపై వాహనాలు తిరిగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మృతురాలి అంత్యక్రియలు పూర్తి

కేవీబీపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు గ్రామానికి చెందిన మంజుల(44) బుధవారం రాత్రి విజయపురం మండలంలో ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదానికి గురై మృతి చెందిన విషయం విదితమే. ఆమె స్వంత గ్రామం కేవీబీపురం మండలం కళత్తూరు కావడంతో నగరి ప్రభుత్వాస్పత్రిలో గురువారం పోస్టుమార్టం నిర్వహించి మంజుల మృతదేహాన్ని భర్త ఆశీర్వాదానికి అప్పగించారు. గురువారం కళత్తూరులో ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మండలంలోని ఆదిత్య స్పిన్నింగ్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తోంది. అనారోగ్యకారణంగా బంధువుల ఇంటికి వెళ్లి పొన్నూరులో వైద్యం చేయించుకుని బుధవారం రాత్రి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రతి గురువారం పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, వెంకటరమణయాదవ్, గిరీష్‌కుమార్, శీను, హేమంత్‌కుమార్, ప్రదీప్‌కుమార్, మణి, మునిచంద్ర, వెంకటేష్, ఓంకార్, వీర మహిళలు శారద, గాయత్రి, బత్తెమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అండగా భవిత కేంద్రాలు ఉన్నాయని ఫిజియోథెరపీ వైద్యులు విజయకుమార్ అన్నారు. గురువారం స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు ఉపాధ్యాయులు గణేష్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

తేనె మంచు పురుగుతో తగ్గిన పూత

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న తేనె మంచు ప్రభావంతో వచ్చే పురుగు వలనే మామిడి చెట్లకు పూత రావడం లేదని మండల ఉద్యాన శాఖాధికారిణి యామిని తెలిపారు. మండలంలోని కనమనంబేడు, నీర్పాకోట, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాల్లో మామిడి తోటలను ఆమె గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఒక లీటరు నీటిలో మల్లీకే మందును కలిపి పిచికారి చేస్తే పూత ఒక్కసారిగా వస్తుందన్నారు. తేనె మంచు నివారణకు బుప్రోపెజిన్‌ను నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. మామిడి, మిరప పంటల సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలకు 79950 86941 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

నిర్వహణ కొరవడి..
మూలకు చేరిన అంబులెన్స్



మూలన పడ్డ అంబులెన్స్

సత్యవేడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వాసుపత్రి నుంచి అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మెరుగైన చికిత్స కోసం తిరుపతి, చెన్నై తదితర ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా శ్రీసిటీలోని ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీ రూ.26 లక్షలు వెచ్చించి ఆస్పత్రికి విరాళంగా ఇచ్చిన నూతన అంబులెన్స్ నిర్వహణ కొరవడి రెండేళ్లకే మూలన పడింది. సత్యవేడు పరిసర ప్రాంతాల నుండి రెఫర్ డెలివరీ కేసులు, ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు, ఇతర ఎమర్జెన్సీ రోగులను అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స కోసం తరలించాలంటే ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేక అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చేది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆదిమూలం సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్ అవసరమని శ్రీసిటీ ఫౌండేషన్‌ను సంప్రదించారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా సహకారంతో పరిశ్రమ ఎండీ కజుహిరో తవిబానా చేతుల మీదుగా 2022 జూలై 19న ఆస్పత్రికి అధునాతన వసతులతో కూడిన అంబులెన్స్‌ను వితరణగా అందించారు. ఈ అంబులెన్స్‌కు ఎలాంటి బాడుగ చెల్లించకుండా కేవలం డీజిల్ ఖర్చులతో రెఫర్ కేసులను తరలించుకోవచ్చు. ఆస్పత్రికి వచ్చే నిరుపేద రోగులకు ఈ అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. అయితే మూణ్ణాళ్ల ముచ్చటలాగా నిర్వహణ లోపంతో అంబులెన్స్ ఏడాదికే మూలకు చేరింది. ప్రస్తుతం అంబులెన్స్‌కు టైర్‌లు మార్చడంతో పాటు, సర్వీసింగ్ తదితర చిన్నపాటి మెయింటెనెన్స్ పనులు చేయాల్సి ఉంది. ఈ చిన్నపాటి మరమ్మతులు చేయకుండా ఏడాదిగా అంబులెన్స్‌ను మూలకు చేర్చేశారు. దీంతో ఆస్పత్రికి వచ్చే పేదలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆస్పత్రి నూతన కమిటీ అయినా స్పందించి అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

రాస్‌లో శాస్త్రీయ సలహా మండలి సమావేశం


రాస్ విజ్ఞాన కేంద్రంలోని పూల సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో 2025-26 సంవత్సరంలో చేయబోయే కార్యక్రమ ప్రణాళిక ఏర్పాటు కోసం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి అధ్యక్షతన గురువారం మండల పరిధిలోని చైతన్యపురం రాస్‌లో శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, వెంకటరమణ, గూడెం శోభమని ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతిపై చర్చించి.. ఈ సంవత్సరం రైతులకు చేపట్టబోయే ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని, ఉద్యాన, పట్టు, పశు సంబంధిత రంగాలలో వ్యాపారవేత్తలుగా వృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రధాన పంటలలో వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కార్యక్రమాలపైన చర్చించి సలహాలు, సూచనలు అందజేశారు. రాస్ కేంద్ర హెడ్ శ్రీనివాసులు, ప్రాంతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, అనుబంధ శాఖ అధికారులు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు తదితరులు

కేవీబీపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం గ్రామానికి చెందిన దళిత సర్పంచ్ పెంచులమ్మ, ఆమె భర్త వెంకటయ్యపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారిని అరెస్టు చేయాలని సీపీఎం నాయకుడు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులతో కలిసి బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ అధికారులు భూసమస్యను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దాడి చేసిన అగ్రవర్ణాల వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు మఠం సర్పంచ్, గ్రామస్థులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆలయ హోర్డింగ్‌లపై ప్రైవేటు ఫ్లెక్సీలు తొలగించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి పలు ప్రాంతాల్లో ఉన్న హోర్డింగ్‌లపై ప్రైవేటు ఫ్లెక్సీలను తొలగించాలని భారత్ ఆర్గనైజింగ్ ఆఫ్ సోషల్ సర్వీస్ సర్వీస్ అధ్యక్షుడు శ్రీపురం సుధాకర్ కోరారు. గురువారం ఈవో బాపిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి కడూరు క్రాస్ వద్ద, శ్రీకాళహస్తి-రేణిగుంట హైవే, శ్రీకాళహస్తి-నాయుడుపేట హైవే, పట్టణంలోని రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఉన్నాయన్నారు. అందులో ప్రైవేటు వారికి చెందిన తమ ప్రకటనల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటిని తొలగించి మహాశివరాత్రికి సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈవో బాపిరెడ్డి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వస్తువుల వితరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు శ్రీకాళహస్తిలోని ఇన్ఫినిటీ ఫిన్‌కార్ప్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వారు రూ.1.50లక్షల విలువైన కుర్చీలు, టేబుల్స్, బీరువాలు, ఆర్వోప్లాంట్ సిస్టం, విద్యార్థులకు విద్యా సామాగ్రిని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో, ఎండీ శ్రీకాంత్ రవల్కర్, రీజనల్ సేల్స్ మేనేజరు మోహన్, మురళి, శివ, ఎంపీడీవో సురేంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు మాధవయ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు థామస్ తెలిపారు. పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం సూర్య నమస్కారం చేశారు. అనంతరం ధ్యానం చేశారు. గురువు థామస్ మాట్లాడుతూ... యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్ సస్పెన్షన్

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డిని పార్టీ అధిష్ఠానం గురువారం సస్పెండ్ చేసింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం కాకుండా ఎమ్మెల్యే ఆదిమూలానికి అనుకూలంగా పని చేశారని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి.. సొంత పార్టీ నాయకులను చులకనగా చేయడం వంటి కార్యక్రమాలకు పాల్పడటంతో స్థానిక నాయకులు ఆయనపై చేసిన అనేక ఫిర్యాదులతో అధిష్ఠానం విద్యానాథరెడ్డిని సస్పెండ్ చేసింది. దీనిపై పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని వైసీపీ నాయకులు అంటున్నారు.

గువ్వలకాలనీని పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ


గువ్వలకాలనీ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రేణిగుంట, తిరుపతి రైల్వే బైపాస్ లైన్ నిర్వాసితుల ప్రాంతాలను శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. గురువారం సంతగేటు వద్ద ఉన్న గువ్వలకాలనీలో నిర్వాసితులతో మాట్లాడుతూ ల్యాండ్ ఎక్విజేషన్ కింద 51 మందికి రూ.14కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ మొత్తాన్ని ఇప్పటికే బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు చెప్పారు. కాటన్ మిల్ సమీపంలో రైల్వేశాఖ రూ.ఐదు కోట్లు వెచ్చించి నిర్వాసితులకు రెండు సెంట్ల చొప్పున స్థలం కేటాయించిందని, ప్రభుత్వానికి సహకరించి ఇక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లాలని సూచించారు. మూడు నెలల ఇంటి అద్దె కింద రూ.3లక్షలు నిర్వాసితులకు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే 26 మంది నిర్వాసితులు స్వచ్ఛందంగా ఖాళీచేసి వెళ్లారని గుర్తుచేశారు. అయితే తమకు ప్రభుత్వం కేటాయించిన స్థలం కాకుండా తమ ప్రాంతానికి దగ్గరగా ఉన్న మరో ప్రాంతంలో స్థలం కేటాయించాలని గువ్వలకాలనీ నిర్వాసితులు కోరుతున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వే పోస్టల్ ఆల్ ఇండియా సర్కిల్ సమావేశం

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు రైల్వే పోస్టల్ ఆల్ ఇండియా సర్కిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కర్నూలు రీజియన్ సూపరింటెండెంట్ అమర్నాథ రెడ్డి గురువారం రేణిగుంటలో ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆర్ఎంఎస్, ఎంఎంఎస్ ఉద్యోగుల అసోసియేషన్ ఆల్ ఇండియా సర్కిల్ సమావేశం ఈసారి ఇక్కడ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా మాజీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేష్, ప్రస్తుత రాష్ట్ర సెక్రటరీ ముక్తార్, ఏజీఎస్ కన్నయ్య, డివిజనల్ సెక్రటరీ మాధవయ్య పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని 132 కేవీ శ్రీకాళహస్తి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గ్రీన్ ప్యానెల్ కండక్టర్ మరమ్మతులకు గురైందని ఈఈ చిన్నరెడ్డెప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం దానిని మార్చేందుకు తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయం, సాయిబాబా ఆలయం, ఎల్ఐసీ కాలనీ, ఈదులగుంట, రామచంద్రాపురం, శాంతిపురం, చిట్టత్తూరు, శివనాథపురం, లక్ష్మీపురం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దశ మందం విద్యా సేవా సదన్ వారు గురువారం నిర్వహించిన జాతీయ హిందీ భాష పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రమణయ్య ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. జాతీయ భాష హిందీపై విద్యార్థులు మంచి పట్టుకలిగి ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలకు గుర్తుగా ప్రధానోపాధ్యాయులు, హిందీ ఉపాధ్యాయులు జ్ఞాపికను విద్యార్థులకు అందజేశారు.